ఆదివారం అనుబంధం
మార్చి 29, 2015

అందం... అభినయం...

ఇక్కడ అవయవాలు మార్చబడును

వాళ్లూ భయపడ్డారట!

తేజస్వి

రవిబాబు

పూర్ణ

హారర్ చిత్రాలను అందరూ ఇష్టపడరు. కొందరే ఆసక్తిగా చూస్తారు. అయితే వాటిని కూడా అందరూ తీయరు. కొందరు మాత్రమే తీయడానికి మొగ్గు చూపుతారు. అలాంటి వారిలో రాం గోపాల్ వర్మ, రవిబాబు పేర్లు ప్రముఖంగా చెప్పకోవచ్చు. అయితే నటుల విషయానికొచ్చేసరికి నందిత, పూర్ణ, తేజస్వి మడివాడ, బిపాషా బసును ప్రధానంగా చెప్పకోవచ్చు. అయితే వీళ్లు కూడా ఆ సినిమాల్లో నటించినప్పడు భయపడ్డారట. "నేను హారర్ సినిమాలెప్పడూ చూడలేదు. షూటింగ్ జరుగుతున్నప్పడు... ఇంటికెళ్లాక... ఏవేవో ఆలోచనలు వచ్చేవి. సినిమాలో ఎవరో చెత్తబుట్ట తెరచినట్టు, షవర్ కింద స్నానం చేస్తున్నప్పడు నన్ను చూస్తున్నట్టు అనిపించే సన్నివేశాలున్నాయి. ఇక ఇంటికెళ్లాక డస్ట్‌బిన్ చూస్తే చాలు భయమేసేది. దాంతో మా ఇంట్లో వున్న అన్ని చెత్తబుట్టలన్నీ తీసేశాను. ఇప్పటికీ షవర్ చేసేప్పడు కళ్లు మూసుకుంటాను గట్టిగా...' అంటోంది పూర్ణ. రామ్ గోపాల్ వర్మ 'ఐస్‌క్రీమ్'లో చేసింది తేజస్వి. "ఒక గదిలో నేను ఒక్కదాన్నే నటించిన సన్నివేశం ఒకటుంది. అందులో కెమెరాలు బిగించి.... నన్ను ఒంటరిగా గదిలో వుంచి బయట తాళం వేశారప్పడు. షూటింగ్ అయ్యాక నేను బయటికి వద్దామని చూస్తే తాళం రాలేదు. సినిమా షూటింగ్ జరిగిన ఇల్లంతా భయంకరంగా వుంటుంది. దాంతో నేనెంతో భయపడిపోయాను" అంటోదీ ఐస్‌క్రీమ్ అమ్మడు. 'ప్రేమ కథా చిత్రం' కథానాయిక నందిత సంగతి చూద్దాం. షూటింగ్ అప్పడు భయపడలేదనే నందిత నిజ జీవితంలో కూడా హారర్ చిత్రాలను ఇష్టంగా చూస్తుందట. పలు హారర్ చిత్రాలను తీసిన రవిబాబు ఏమంటాడో చూద్దాం. "మేం పెంట్ హౌస్‌లో వుంటాం. ఓరోజు రాత్రి పదకొండు గంటలకు ఎవరో బాస్కెట్‌బాల్ ఆడుకుంటున్న శబ్దం వినిపించింది. బయటికెళ్లి చూస్తే ఎవరూ లేరు. ఇలా నాలుగైదు సార్లు జరిగింది. తర్వాత ఓరోజు నేను బాస్కెట్ బాల్‌ను చూశాను. కానీ అక్కడెవరూ లేరు. కొద్ది రోజుల తర్వాత ఓ పిల్లాడు బాస్కెట్ బాల్ ఆడుకుంటూ కనిపించాడు. ఇంట్లో వాళ్లు నిద్రపోయాక వచ్చి ఆడుకోవడం ఆ పిల్లాడికలవాటని కూపీ లాగితే తెలిసింది...నేను ఒంటరిగా నిద్రపోను. లైట్లు వేసే వుంచుతాను. టీవీ నడుస్తూనే వుంటుంది. అప్పడుగానీ నిద్ర పట్టదు" అని చెప్పకొచ్చాడు రవిబాబు. ఈయనే కాదు. వరుసగా అనేక హారర్ చిత్రాలలో నటించిన బిపాషా కూడా అంతే. ఇంట్లో తనను ఎవరో రహస్యంగా అనుసరిస్తున్నట్టు భ్రమపడి ... లైట్లు వేసుకునే నిద్రపోవాల్సి వచ్చిందట 'అలోన్' సినిమా చేసినప్పడు. అది సినిమా అని.. స్క్రిప్టు ప్రకారం... తాము దర్శకుడు చెప్పినట్టు ... చెప్పిన పాత్రలో నటిస్తున్నామని తెలిసినప్పటికీ ... భయపడిపోతున్నారీ తారాగణం. మరి వీళ్ల పరిస్థితే ఇలా వుంటే... అమాయకంగా సినిమా హాల్లో కూర్చుని చూసేవాళ్లకెలా వుండాలి. భయపడుతూ ... భయపెట్టే సినిమాలు తీయడం అవసరమా అనేది ప్రశ్న?! ●

నందిత



బిపాషా

ప్రజాశక్తి
snehaweekly.praja@gmail.com

లీకు బాగోతాలు

వేసవి కాలం ఊరకే వస్తుందా! వస్తూ వస్తూ బోలెడన్ని బహుమతులు మోసుకొస్తుంది. మల్లెలు, మామిళ్లు, ఈత పళ్లు, తాటి ముంజెలు... వంటివెన్నో. వీటితోపాటు తట్టుకోలేని ఎండలనూ పట్టుకొస్తుంది. వీటన్నినీ 'హాయిగా' ఆస్వాదిస్తుండగానే...'పరీక్షలూ' పెట్టేస్తుంది. వయోవృద్ధులు ఎండలకు తాళలేక పరీక్షల్లో ఫెయిలైపోయి బక్కెట్ తన్నేయనూవచ్చు.

చిన్నారులు ఏడాదంతా కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమౌతారు. సరిగ్గా పరీక్ష ముందురోజు అర్ధరాత్రో... అపరాత్రో ... మిట్ట మధ్యాహ్నమో ... పేపర్ లీకైనట్టు వార్తలొస్తాయి .

బాగా చదువుకున్న పిల్లలు డీలా పడిపోతే... చివరి బెంచీ విద్యార్థులు మాత్రం సంతోషంతో గెంతులు వేసేస్తారు. ఎంత డబ్బు పోసైనా సరే వాటిని కొనుక్కోవడానికి వెనుకాడరు. ఎలాగోలా ఆ పది ప్రశ్నల సమాధానాలను ముక్కున పెట్టుకెళ్లి రాసేస్తారు. ఏడాదంతా కష్టపడ్డ చిన్నారులకు నష్టం చేసే లీకేజీ కొందరికి మాత్రం తాత్కాలిక ఊరటనిస్తుంది. పెద్ద పెద్ద వాళ్ల జోక్యం లేకుండానే ఈ అవినీతి బాగోతం నడుస్తుందని ఎవ్వరూ అనుకోరు. ఎప్పటికప్పుడు ఈ లీకేజీలను అడ్డుకుంటామని విద్యాశాఖామంత్రులను మొదలుకొని పై అధికారుల వరకు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పించేయడం...ఏడాది తిరిగేసరికి మళ్లీ పేపర్లు లీకవడం షరామామూలే!

మరి మన మధ్య గ్రీకు వీరులే కాదు. లీకువీరులూ వుంటారు. ఇళ్లల్లోను, సంస్థల్లోను, ప్రభుత్వాల్లోను... ఇందుగలరందు లేరని సందేహంబు వలదు. ఎందెందు వెదకినా కనిపించేస్తారు.

అయినా పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న బడ్జెట్ పత్రాలే లీకౌతున్నాయి. ఇక పిల్లకాయల ప్రశ్నాపత్రాలెంత? కట్టుదిట్టమైన భద్రతా సిబ్బంది మధ్య వుండాల్సిన బడ్జెట్ పత్రాలు ... బయటికెలా వస్తాయి? అనేది బేతాళుడికి సైతం అంతుబట్టని ప్రశ్నే అయినప్పటికీ ... 'కీ'లకమైన వ్యక్తుల సాయం లేకుండా అసాధ్యమన్నది ఎవరికి మాత్రం తెలీదు. ఏమో! కావాలనే అధికార పక్షం వారే ఆ పత్రాలను లీక్ చేసి వుండొచ్చు. తాము బాదబోయే పన్నులపై సామాన్య జనం, మేధావుల స్పందన ఎలా వుంటుందో తెల్సుకోవడానికి వేసిన ఎత్తుగడ కావొచ్చు. ఒకేసారి పార్లమెంటులో గగ్గోలు పుట్టకుండా పన్నిన పన్నాగమూ కావొచ్చు. భారాలు ఎటూ మోపుతారు. ఇక ఈ లీకేజీల వల్ల పెద్దగా పోయిందేముంది? అన్న నిర్వేదం నిరుపేదల్లో నింపడానికి చేసిన పనీ కావొచ్చు.

నిద్రలోనూ భయపెట్టే లీకేజీలు కొన్ని వుంటాయి. అలాంటివాటిలో భోపాల్ గ్యాస్ లీకేజీ ఒకటి. మూడు దశాబ్దాలు గడిచినా వేలాదిమంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న వారికి శిక్ష పడిందే లేదు.

చెడ్డవే కాదు. మంచి లీకులూ వుంటాయి. అలాంటి వాటిలో వికీ'లీక్స్' ఒకటి. ప్రపంచ పెద్దన్నగా పేరొందిన అమెరికా వాడి క్రూరత్వాన్ని బయటి ప్రపంచం ముందు పెట్టిందీ సంస్థ.

మంచి విషయాలను లీక్ చేసేవారికి సలాం చేస్తూనే నష్టం చేసే లీక్‌లకు చెక్ పెట్టి...అలాంటి లీక్‌వీరుల ఆట కట్టించకపోతే పిల్లలకే కాదు. అందరికీ నష్టమే.

◆ మనలో మాట

టపా

స్ఫూర్తిదాయక కథనం

'**అ**తని ప్రపంచంలో ఆమె' కవర్ స్టోరీ స్ఫూర్తి దాయకంగా వుంది. అవకాశం అందితే మహిళలు అన్ని రంగాలలో రాణించగలరని రుజువు చేశారు. శిక్షణ ఇస్తే అన్ని రంగాలలోనే మహిళలు రాణించగలరని చేసి చూపించారు. వాస్తవానికి పురుషుల కంటే మహిళలు బలవంతులు, తెలివైన వాళ్ళు. అయినప్పటికీ ప్రకృతి పరంగా, శారీరక ధర్మాల పరంగా స్త్రీ పురుషులు వేరు వేరు అయినప్పటికి పనిలో నిబద్ధత, నాయకత్వంలో క్రమశిక్షణకు మారు పేరుగా వుంటారు. చాలా కర్మాగారాలలో మహిళలకు ఉద్యోగ అవకాశాలు లేవు. చట్ట సభలలో 33శాతం రిజర్వేషన్లు అమలులో లేవు. దాడులకు బలి అవుతున్నారు. ఎదుర్కొనడానికి సిద్ధపడాలి. ఇలాంటి కథనాలు మరిన్ని రావాలి.

- టి. శ్రీరామమూర్తి, గాజువాక - విశాఖపట్నం

ఆశలు నెరవేరాలి

మనలో మాటలో చెప్పినట్టు మన్మథ నామ సంవత్సరం సందర్భంగా ప్రజల చిన్ని చిన్ని ఆశలు నెరవేరాలని కోరుకుంటున్నాం. నిజంగానే మనకి అన్నీ వున్నాయి. సహజ వనరులు, సంపద అన్నీ పుష్కలంగా వున్నాయి. చేసేందుకు జనమూ సిద్ధంగా వున్నారు. కానీ నేతలకే చిత్తశుద్ధిలేదు. దేశ ప్రజల ఆశలు నెరవేర్చాలన్న బుద్ధి వారికి లేదు. అందుకే కూరగాయల దగ్గర నుంచి అన్నిటి ధరలూ చుక్కలను చూస్తున్నాయి. అవన్నీ అందరికీ అందుబాటులోకి వచ్చిన నాడే నిజమైన ఉగాది.

- బొర్రా మాధవ్, సంగుపాలెం కోడూరు.

ఎర్రటి ఎండల్లో చల్లటి వంటకాలు

ఈవారం రుచిలో చక్కటి వంటకాల గురించి ఇచ్చారు. ఎండల్లో ఏవైతే ఎక్కువగా తినాలో వాటి గురించి ఇవ్వడం బాగుంది. తోటకూర పులుసు, మజ్జిగ పులుసు, పెరుగు గారె, పచ్చి పులుసు... వంటి తేలికపాటి ఆహారం తీసుకోవడం ఎంతో మంచిది. అలాగే వేసవిలో చల్లగా లాగించేసే వాటి గురించి కూడా ఇస్తే నయం కదా.

- నూతలపాటి విజయలక్ష్మి, గుంటూరు.

నిజం చెప్పాడు

ధనుష్ చెప్పిన మాటలో ఎంతో నిజం వుంది. ప్రతిభను మించిన అందం లేదు. ప్రతిభతో సాధించే విజయాన్ని మించిన అందం లేదు. పైకి కనిపించే అందం కన్నా మనిషి లోలోపల దాగివుంటే సామర్థ్యాల్లోనే అసలైన అందం వుంది. నిజంగా ధనుష్ చెప్పిన విషయాలన్నీ ఆసక్తికరంగా చదివించాయి. కావడానికి తమిళ నటుడే అయినా ఇటు తెలుగులోను, అటు హిందీ లోను కూడా రాణిస్తున్నప్పటికీ ఏమాత్రం గర్వం లేకుండా అణకువతో మాట్లాడడాన్ని యువత నేర్చుకోవాలి. తమిళ సూపర్‌స్టార్ అల్లుడైనా తన స్వయం ప్రతిభతో ప్రకాశించాలన్న తపన మెచ్చుకోదగినది. ఆచరించదగినది.

- సిహెచ్. సంధ్య, కడప.

కదిలించిన కువైట్ జ్ఞాపకాలు

చూద్దామాలో ఇచ్చిన కువైట్ జ్ఞాపకాలు చదివాక మాకూ అక్కడికెళ్లాలనిపించింది. ఆ యుద్ధకాండ, చనిపోయిన పౌరులు, సైనికుల గురించి చదివి చలించిపోయాం. అయితే అక్కడి మ్యూజియాల గురించి చాలా తెలుసుకున్నాం. ప్రతిభా వంతులైన చిన్నారుల గురించి, వారికి నచ్చే మ్యూజియమ్స్, ప్రదేశాలు, జంతువుల గురించి కూడా ఇస్తే బాగుంటుంది.

- గాదె ఉదయ్, చంటి, విద్యానగర్, చీరాల.

ఈ సంచికలో....

ఇక్కడ అవయవాలు మార్చబడును

కవర్‌స్టోరీ 14

మానవ నిర్మాణంలో ప్రతి అవయవమూ విశిష్టమైనదే. ప్రతి అవయవమూ పునఃసృష్టి చేయలేనిదే. వయసు రీత్యా అవయవాలు పటుత్వం తగ్గి మరణించడం కాకుండా ఆధునిక జీవన విధానంతో ఆకస్మిక అకాల మరణాలు పెరిగాయి. రకరకాల వ్యాధులు, ప్రమాదాలు చిన్న వయసు వారినే పొట్టన పెట్టుకుంటున్నాయి. వారితోపాటు అపూర్వమైన అసమానమైన సంక్లిష్ట అవయవాలు కూడా మట్టిలో కలిసిపోతున్నాయి. అగ్గిలో బుగ్గయిపోతున్నాయి. అలాంటి వారి శరీర భాగాలను... పలు అవయవాలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న వారికి అమర్చగలిగితే! ఆ విశేషాలేంటో ఈ వారం అట్టమీది కథలో తెలుసుకుందాం.



టెక్ గురు 3
ఒత్తిడిని చిత్తు చేసే యాప్

చూద్దామా 4
సోయగాల నయాగరా

కథ 6
రెండు జన్మలు

ప్రత్యేకం 8
ఏరైక మహిళా మావటి ప్రభాతి బారువ

వింతలోకం 9
క్రిమికీటకాలే ఆహారం

సినిమా కబుర్లు 10
అందం...అభినయం...

నవ్వుల్ పువ్వుల్ 11

సీరియల్ 18
ప్రేమ విప్లవం

రుచి 21
బనానా షేక్

బాలనేస్తాలు 22
జంటగా లేనివి ఏవి ?

కొత్త పుస్తకాలు 24
గొప్ప ప్రేరణ

స్ఫూర్తి అధికారులంటే వీరే 12

◆ టెక్ గురు



డిప్రెషన్ అనేది ఒక దశ మాత్రమే కాదు. వెంటనే పట్టించుకోవాల్సిన సమస్య. మన డిప్రెషన్‌ను దూరం చేసేందుకు మొబైల్ ఫోన్‌లో కొత్త యాప్ వచ్చింది. ఇది.. తెలియకుం డానే మనలోని డిప్రెషన్‌ను దూరం చేస్తుంది. తోటి వారితో మాట్లాడి.. నిపుణుల సలహా తీసుకునేం దుకూ సహకరిస్తుంది. ఈ కొత్త యాప్ ఒక్కక్లిక్ దూరంలోనే ఉంది.

ఒత్తిడిని చిత్తు చేసే యాప్

పరీక్షల్లో ఫెయిల్ అయ్యామనో, ప్రేమలో విఫలమ య్యామనో ప్రతి సంవత్సరం వేలాది మంది టీనేజర్లు ఆత్మహత్య చేసుకుంటున్నారు. గుండె పగిలిన యువ, బాల, బాలికలు డిప్రెషన్ నుంచి సునాయాసంగా తప్పించుకునేందుకు ఆత్మహత్య అనే మార్గాన్ని ఎంచుకుంటున్నారు. అంతేకాదు.. జీవితంలో ఎక్కువ భాగం డిప్రెషన్‌లోనే గడిపే వారి సంఖ్య పెరుగుతోందని అధ్యయనాలు తెలియచేస్తున్నాయి. మానసిక నిపుణుడి (సైకియాట్రిస్ట్) దగ్గరకు వెళ్తే డిప్రెషన్ సమస్య పరిష్కారమవుతుంది. అయితే.. ఉత్తమ పరిష్కార మేంటంటే.. మీ సమస్యను అర్థం చేసుకోగలిగే వాళ్లతో చర్చించడమే. కానీ.. డిప్రెషన్‌కు గురైన వ్యక్తులు తమ సమస్యను ఇతరులతో బహిరంగంగా చర్చించడానికి ఇష్టపడరు. ప్రపంచ వ్యాప్తంగా 35 కోట్ల మంది డిప్రెషన్ సమస్యతో బాధపడ్తున్నారు. 30 లక్షల మంది డిప్రెషన్‌కు ఏకంగా బానిసగా మారిపోయారు. ప్రతి 40 సెకన్లకు ఒకరు డిప్రెషన్ వల్ల ఆత్మహత్య చేసుకుం టున్నారు. ప్రజల్లో భావోద్వేగ సమస్యలు పెరుగు తున్నాయనడానికి ఈ గణాంకాలే నిదర్శనం. భావోద్వేగాలపై సరైన అవగాహన లేకపోవడం, సహాయం తీసుకోవడానికి సామాజిక భయం, అవసరమైనప్పుడు నిపుణులు లభించకపోవడం వల్ల డిప్రెషన్ బాధితులు రోజురోజుకూ పెరుగు తున్నారు.

స్మైల్ యాప్‌తో డిప్రెషన్ గాయబ్..!

నాగేశ్వరి బంధువు డిప్రెషన్‌కు గురైనప్పుడు దాని తీవ్రతను ఆమె గుర్తించింది. ఆమె స్నేహితుల్లో కొంత మంది కూడా డిప్రెషన్‌తో బాధపడటాన్ని గమనించింది. డిప్రెషన్ ఒక దశ మాత్రమే కాదు.. చర్చించాల్సిన తీవ్ర సమస్య అనే నిర్ణయాని కొచ్చింది. వెంటనే డిప్రెషన్‌పై పరిశోధన ప్రారంభించిన నాగేశ్వరి.. చాలా మంది మానసిక నిపుణులతో చర్చించింది. చాలా మంది పేషెంట్లను కలిసింది. ప్రస్తుత పరిస్థితిపై చాలా పరిశోధనలు చేసింది. మన సమాజంలో డిప్రెషన్ అనే సమస్యను చాలా నిర్లక్ష్యం చేస్తున్నారని గుర్తించి ఆశ్చర్యపోయింది. దీని గురించి మాట్లాడేందుకు ప్రజలు సిగ్గుపడుతున్నారని గ్రహించింది. డిప్రెషన్‌కు గురైన వాళ్లకు ఎక్కడికి వెళ్లాలో.. తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియదు. ఎవరైనా పునరావాస కేంద్రానికి వెళ్లాలని అనుకుంటే.. మూడు, నాలుగు నెలల వరకూ వెయిటింగ్ లిస్టు ఉంటుంది. అంత సమయం వేచి ఉండటం అందరికీ సాధ్యం కాదు.

దీంతో తీవ్రంగా ఆలోచించిన నాగేశ్వరి.. డిప్రెషన్ పేషెంట్లు తమ సమస్యలను గురించి ఒకరినొకరు చర్చించుకునేందుకు.. మానసిక నిపుణుడ్ని సంప్రదించి.. తమ సమస్యలను పంచుకొనేందుకు ఒక వేదికను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హ్యాపీ బీయింగ్ అనే నమూనా యాప్‌ను నాగేశ్వరి డిజైన్ చేసింది. డిప్రెషన్‌లో ఉన్న వారు ఈ యాప్ ద్వారా మళ్లీ ఉత్సాహాన్ని పొందుతారు. తమ సమస్యలను ఇతరులతో పంచుకోగలుగుతారు. తమ గుర్తింపు ఇవ్వకుం డానే నిపుణుల సలహాలు కూడా పొందగలుగు తారు. మన మూడ్ సంతోషం నుంచి బాధలోకి.. బాధ నుంచి సంతోషంలోకి మారేందుకు 10 సెకన్ల సమయమే పడ్తుందని డాక్టర్లు చెప్తున్నారు. డిప్రెషన్‌కు లోనైన వ్యక్తులు యాప్‌లో గతంలో పెట్టిన సంతోషాన్ని కలిగించే

నాగేశ్వరి

వీడియోలు, ఫొటోలు, సందర్భాలను మరోసారి చూసుకోవాలి.

నమూనా యాప్ విజయవంతం

నాగేశ్వరి తయారు చేసిన నమూనా యాప్ విజయవంతమైంది. ఆ యాప్‌ను లక్షా 25 వేల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. దీంతో నాగేశ్వరికి ఈ యాప్ బాగా పని చేస్తోందన్న ధైర్యం వచ్చింది. యాప్‌ను మరింత అభివృద్ధి చేసే పనిలో పడింది. యాప్ అప్‌డేటెడ్ వెర్షన్‌ను తయారు చేసి.. ప్రపంచ మార్కెట్‌లోకి విడుదల చేసింది. దీనికి కూడా మంచి ఆదరణ లభించింది. అప్‌డేటెడ్ యాప్‌ను ఐఓఎస్ ద్వారా లక్షా 50 వేల మంది, గూగుల్ ప్లే ద్వారా మరో 35 వేల మంది డౌన్ లోడ్ చేసుకున్నారు. ప్రజలు అప్‌డేటెడ్ యాప్ ద్వారా నామమాత్రపు ఫీజు చెల్లించి నిపుణుల అపాయింట్‌మెంట్ కూడా తీసుకుంటున్నారు. దీనికి స్మైల్ యాప్ అని నామకరణం చేశారు.

మరింత మెరుగ్గా...

ఆరుగురు నిపుణులు, కౌన్సిలర్లు, సైకియాట్రిస్టులతో కలిసి యాప్‌ను మరింత మెరుగుపర్చే పనిలో నిమగ్నమైంది. నాగేశ్వరి. డిప్రెషన్‌తో బాధపడ్తున్న ప్రజలందరికీ ఈ వెబ్‌సైట్ ఉపయోగకరంగా ఉంటుందన్నది ఆమె అభిప్రాయం. భవిష్యత్తులో అన్ని రాష్ట్రాల్లోనూ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నది ఆమె లక్ష్యం.

- పెండెం సురేంద్ర కుమార్

◆ చూద్దామా



అందాల నయాగరా జలపాతాన్ని చూసే వరకు అనుకోం అది అంత అందమైనదని. నీరు పాలధారల్లా కనిపించడమేంటి? దాని ఒయ్యారాలు, సొగసులు చూచి మనసు పరవశించడమేంటి? అవనికి దిగివచ్చిన ఆకాశగంగలా అగుపడడమేంటి? అని తెగ ఆశ్చర్యపోయిన మనమే....'ఔను అవన్నీ నిజమే సుమా' అనుకొంటాం. జలపాతం ఉధృతిని చూసి మైమరచిపోతాం. అల్లంత దూరాన నిలబడిన మనల్ని తన చిలిపి తుంపరలతో తడిపి మరీ పలకరించే నయాగరాను మర్చిపోలేం. ఆ అద్భుతానుభూతిని జీవితాంతం నెమరువేసుకుంటూనే వుంటాం.

సోయగాల నయాగరా

ప్రపంచంలో తప్పక చూడాల్సిన వాటిలో సోయగాల నయాగరా ఒకటి. ఇది ప్రపంచంలోకల్లా వెడల్పయిన జలపాతం. అమెరికా, కెనడా సరిహద్దుల్లో ప్రవహించే చిన్న నది. అసలు అక్కడికి వెళుతున్నామూ అంటనే మనసంతా ఉద్విగ్నతతో నిండిపోతుంది. తీరా అక్కడికెళ్లాక ... ఆ అందాలను కనులనిండా నింపుకోవడంలోనూ, ఆస్వాదించడంలోనూ మునిగిపోతాం.

నయాగరా జలపాతం మొత్తం పొడవు 60 కి.మీటర్లకు మించదు. ప్రవాహ ఉధృతీ తక్కువే. మరి దీని ప్రత్యేకత ఎక్కడ వుందీ? అనిపిస్తుంది. ఈ చిన్న నది సుమారు 180 అడుగుల లోతులో పడే దృశ్యం మనల్ని కట్టిపడేస్తుంది. ఆ మనోహర, మనోజ్ఞ దృశ్యం చూసినవారి తనువు పులకించిపోతుంది. కెనడావైపు సుమారు 2000 అడుగుల వెడల్పులో గుర్రపు నాడా ఆకారంలో 140 అడుగుల లోతులో జల పడుతుంది. అమెరికా వైపు జలపాతం మరింత లోతైనది. కానీ వెడల్పే తక్కువ.

కెనడావైపు జలపాతం చూడాలంటే కెనడా వీసా కావాలి. అయితే గ్రీన్‌కార్డ్ వున్నవారికి అది అవసరం లేదు. డెట్రాయిట్ నుంచి నయాగరా సుమారు 300 మైళ్ల దూరం. డెట్రాయిట్‌కు దక్షిణంగా వున్న కెనడాలో అయితే ప్రపంచంలోకెల్లా అతి పెద్దదైన సీఎన్ టవర్ వుంది.

అక్కడ జలపాతం వ్యూ వున్న హోటళ్లకు గిరాకీ ఎక్కువగా వుంటుంది. అక్కడ ఏదైనా హోటల్లో గది తీసుకొని కిటికీలోంచి నయాగరా చూస్తుంటే వుంటుందీ...! ఇంక నోట మాటే రాదు. అలా చూస్తుండిపోతాం ఎంతసేపైనా. మరీ మొదటిసారి చూసేవారైతే ఇంక అంతే సంగతులు. ఇంక జలపాతం దగ్గరున్న టేబుల్ రాక్ కాంప్లెక్స్ చూడదగినది. అదే జలపాతానికి 20 అడుగుల దూరంలో నిలబడ్డాం అనుకోండి. నిమిషానికి 20 కోట్ల లీటర్ల నీరు 170 అడుగుల లోతుకు పడుతుంటే ఆ హోరు, వందల అడుగుల ఎత్తుకు లేచి పడే నీటి తుంపరల అలలు... అసలు మాటల్లో ఎలా చెప్తాం! ఆ అందాన్ని వర్ణించడానికి ప్రపంచంలో వున్న ఏ భాషా సరిపోదేమో అనిపిస్తుంది. ఆ తుంపరలు మనల్ని తడిపేస్తుంటే వుంటుందీ...

జర్నీ బిహైండ్ ద హిల్స్ సంగతి మర్చిపోతే ఎలా! టేబుల్ రాక్ ఆఫీసులోనే టికెట్ తీసుకొంటే ఒక రెయిన్ కోట్ (డిస్పోజబుల్) ఇచ్చి లిఫ్టులో 125 అడుగులు కిందికి తీసుకెళతారు. అక్కడ అద్దాల తలుపులోంచి జలపాతాన్ని బాగా దగ్గరగా చూడొచ్చు. నీటి మట్టానికి 26 అడుగుల ఎత్తులో ఒక బాల్కనీ వుంది. మూడు వైపులా రెయిలింగ్స్ వుంటాయి. చల్లచల్లటి నీటి తుంపరలు అలా మొహం మీద పడి పలకరిస్తూ వుంటుంటే వుంటుందీ... ఆ ఆనందం మరెప్పుడూ కలగదేమో! వారిచ్చిన రెయిన్ కోట్ కూడా తీసేసి తడిచిపోవాలనిపిస్తుంది.

అక్కడ భారతీయులే కాదండోయ్! యూరోపియన్లు, చైనీయులు, ఆఫ్రికన్లు ... ఎంతోమంది విదేశీయులు చిన్నపిల్లల్లా



స్కైలాన్ టవర్

కేరింతలు పెడుతూ జలపాతం తుంపర జల్లుల్లో తడిచిపోతుంటారు. తర్వాత అక్కడినుంచి టన్నెళ్ల ద్వారా అద్దం బిగించిన కిటికీ లోంచి మరింత దగ్గరగా నీటిని చూడొచ్చు. ఆ తర్వాత పైకి వచ్చి వేడివేడి కాఫీ తాగుతూ... జలపాత దృశ్యాలను చూస్తుంటే గంటలు నిమిషాల్లా గడిచిపోతాయి.
జలపాతాన్ని మరింత దగ్గరగా చూసే వీలు కూడా వుంది. అదెలా అంటారేమో!
అదెలాగంటే... మెయిడ్ ఆఫ్ ది మిస్ట్ యాత్ర ద్వారా. అక్కడి గుర్రపు నాడా ఆకారంలో వున్న నదిభాగంలోకి తీసుకెళతారు. దీనికి కూడా ప్రత్యేకమైన టికెట్టుకొనాలి. అందరికీ రెయిన్ కోట్లు ఇస్తారనుకోండి. మనం ఎక్కిన బోటు పక్కగా 170 అడుగుల ఎత్తు నుంచి పడే నీటి ఉధృతి, తుంపర్లు ... పైగా మనం ఎక్కిన ఓటు జలపాతానికి దగ్గరగా వెళుతూ వుంటే భయం పెరుగుతూ వుంటుంది. అయితే అదేదో సాహస యాత్రలాగా బావుంటుందిలెండి. మొహం మీద పడుతున్న తుంపరలను తుడుచుకోవడం కూడా మర్చిపోయి అలా చూస్తుండిపోతారెవరైనా. కాసేపటి తర్వాత తిరిగి బోటు మనల్ని వెనక్కి తీసుకెళ్తుంది. రాత్రిపూట జలపాతం దగ్గర మూడు నాలుగు రంగులు లైట్లు వెలుగుతూ ఆరిపోతున్నట్టు చేసిన ఏర్పాటుచూస్తే మతిపోవాల్సిందే.
వయోభేదం లేకుండా నయాగరా జలపాతం అందాలను అంతా ఆస్వాదిస్తారు. ఇక కొత్తగా పెళ్లయినవారికైతే అది స్వర్గమే అనుకోండి.
ఇక్కడ చూడ్డానికి ఈ జలపాతం ఒక్కటేనా మరేం లేవా? అనుకోకండి. చాలానే వున్నాయి. మెరైన్ ల్యాండ్ అనే ప్రాంతంలో తిమింగలాలు, డాల్ఫిన్లు, సీ లయన్లు ... వంటి ఎన్నో సముద్ర జంతువులును కూడా కన్పిస్తాయి. కొన్నింటినైతే తాకొచ్చు కూడా. డాల్ఫిన్ షో చాలా బావుంటుంది. అక్కడ చాలా పెద్ద స్టీల్ రోలర్ కోస్టర్ వుంది. దాని మీద ఆడుకోడానికి పిల్లలు తెగ ఆరాటపడతారు. ఇదే కాదు. కేబుల్ కారులో జలపాతం చూడడం... తుంపర్లలో తడవడం కూడా గొప్ప అనుభూతి. అక్కడ 600 అడుగుల ఎత్తయిన మినోల్లాట, 800 అడుగుల ఎత్తున్న స్కైలాన్ టవర్ల మీద నుంచి కూడా జలపాతాన్ని చూడొచ్చు.
స్కైలాన్ టవర్ మీద రివాల్వింగ్ హొటల్ వుంది. అది తన చుట్టూ తాను తిరుగుతూ వుటుంది.
అందులో కూర్చుని మనం టిఫిన్ తింటూ, కాఫీ తాగుతూ జలపాతాన్ని వుంటే చాలా బావుంటుంది.
బొటానికల్ గార్డెన్లో 2300 రకాల గులాబీలు పూస్తాయని చెప్తుంటారు. అక్కడి బటర్‌ఫ్లై కన్జర్వేటరీ కూడా మనల్ని కట్టిపడేస్తుంది. అందులో 2000 రకాల సీతాకోకచిలుకలు తమ రంగురంగుల రెక్కలను ఆడిస్తూ వయ్యారంగా పోతుంటే మన మనసు ఒకచోట నిలవదు సుమా! క్లింటన్ హిల్ ఏరియా దగ్గరకు వెళ్లామూ అంటే పిల్లలు వదిలి రానేరారు. ఇవేకాక రిప్లీస్ బిలీవ్ ఇట్ ఆర్ నాట్, రిప్లీస్ మూవింగ్ థియేటర్, గిన్నిస్ మ్యూజియం, వ్యాక్స్ మ్యూజియం, గుర్రపుబగ్గీ సవారీ... అన్నీ చూడాల్సినవే.
ఇక డెట్రాయిట్ పట్టణం ప్రత్యేకంగా చూడదగినది. ఇది డెట్రాయిట్ నది ఒడ్డున వుంది. తమాషా ఏంటంటే ఇక్కడ కూసింత దొంగల బెడద ఎక్కువే. కానీ మ్యూజియంలకు పేరుగాంచిన ప్రాంతం. అందుకేనేమో దీన్ని మ్యూజియంల నగరం అని కూడా పిలుస్తారు ముద్దుగా.
ఇక్కడ... హెన్రీఫోర్డ్ మ్యూజియం, ఐమ్యాక్స్ థియేటర్ వున్న కాంప్లెక్స్ అద్భుతంగా వుంటాయి. వీటి తర్వాత చూడాల్సింది బెల్లీ ఐలాండ్. ఇది అమెరికా మొత్తంలోకి అతి పెద్ద ఐలాండ్ పార్కు. వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో వున్న ఈ పార్కులో పాలరాతి లైట్ హౌస్, బీచ్, అన్ని రకాల ఆటలు ఆడుకోనేందుకు మైదానాలు, పూలమొక్కలు, వన్యప్రాణి సంరక్షణ కేంద్రాలు ... ఒకటేంటి...అన్నీ కనిపిస్తాయి.
మనం ఇప్పటి వరకు కెనడావైపున్న నయాగరా అందాలను మాత్రమే చెప్పుకున్నాం. ఇప్పుడు అమెరికా వైపున్న అందాలను చూద్దాం. ఇది కొంచెం దూరం ఎక్కువే అనుకోండి. న్యూయార్క్, న్యూజెర్సీ, మేరీల్యాండ్ లో వుండేవారికి దగ్గర. ఆ పక్కనే వున్న నయాగరా నదిలో చూడాల్సింది గోట్ ఐలాండ్. అమెరికన్ ఫాల్స్‌కు, కెనడా ఫాల్స్‌కు మధ్యలో ఈ ఐలాండ్ వుంది. ఇక్కడ రెండు జలపాతాలు కనిపిస్తాయి. అమెరికన్ ఫాల్స్ బ్రైడల్ వీల్ అంటారు వీటిని. లిఫ్టులో 175 అడుగులు దిగి, జలపాతానికి 25 అడుగుల దగ్గరకు వెళ్లొచ్చు. పూర్తిగా తడిచిపోతామనుకోండి. ఇక్కడ కూడా మెయిడ్ ఆఫ్ ద మిస్ట్ ట్రిప్ వుంటుంది. కాకపోతే కెనడావైపు జలపాతం చూడ్డానికి అయ్యే ఖర్చుకంటే ఇక్కడ అన్నీ రేట్లు ఎక్కువే. ఇక్కడ మరో తమాషా ఏంటంటే... హీలియం బెలూన్‌లో కూర్చుని 400 అడుగుల ఎత్తు నుంచి జలపాతం చూడొచ్చు. మనో ముఖ్యమైన విషయమేమంటే నయాగరా హిస్టరీ మ్యూజియంలో డయానా, మదర్ థెరిస్సా వంటి ప్రముఖుల బొమ్మలు వుంటాయి. వీటిని చూస్తుంటే బొమ్మలనుకోం. నిజంగా సదరు మనుషులే అక్కడ నిలబడినట్టు అనిపిస్తుంది.
ఇవండీ నయాగరా జలపాతం ముచ్చట్లు. ఇప్పుడేమనిపిస్తోంది! ఎలాగైనా సరే... అక్కడికెళ్లి జలపాతం తుంపర్లలో తడిచిపోవాలనిపిస్తోందా!

✦

అక్కడి బటర్‌ఫ్లై కన్జర్వేటరీ కూడా మనల్ని కట్టిపడేస్తుంది. అందులో 2000 రకాల సీతాకోకచిలుకలు తమ రంగురంగుల రెక్కలను ఆడిస్తూ వయ్యారంగా పోతుంటే మన మనసు ఒకచోట నిలవదు సుమా!

వ్యాక్స్ మ్యూజియం

రెండు జన్మలు !

రైలు దువ్వాడ దాటి విశాఖపట్నం వైపు నెమ్మదిగా వెళ్తోంది. "చాయ్! చాయ్!! బజ్జీ, సమోసా, పల్లీ పల్లీ..." అంటూ అమ్మకందార్లు అటూ ఇటూ రద్దీగా తిరుగుతున్నారు. జగన్ ఇవేవీ పట్టించుకోకుండా కిటికీ దగ్గరగా కూర్చుని పకృతిని పరిశీస్తున్నాడు. చెట్లూ పుట్టలూ గట్లూ దాటుకుని రైలు ముందుకు పోతోంది. జగన్ కంట్లో నలుసు పడింది. కలుక్కుమంది. రుమాల్తో కన్ను అద్దుకుని ముఖమంతా తడుచుకున్నాడు. అయినా కన్ను కరుక్కుమంటూనే ఉంది.

రైల్లోకి హిజ్రాల గుంపు చొరబడింది. అందరి ముందూ ఆగి వీలైనంత దండుకుంటున్నారు. ఇచ్చిన వాళ్లని వదిలి ఇవ్వని వాళ్లని ఈసడించి ఏవేవో అంటున్నారు. జగన్ వంతొచ్చింది. కంట్లో నలుసుతో బాధగా ఉంటే రుమాల్తో కను అద్దుకుంటున్నాడతను.

"బావా! నిన్నే!!' అన్నాడొక హిజ్రా. అరువు తెచ్చుకున్న ఆడకంఠం కరుగ్గా వినిపించింది. పైగా వరసపెట్టి మరీ పిలుపు. 'నిన్నే



బావా'! రెట్టించాడు మరో హిజ్రా. ముఖం చిట్లించాడు జగన్.

"పాపం! అందాల బావ కంట్లో నలుసుపడింది. ఉండవే!' అన్నాడు మరో హిజ్రా. చుట్టూ మూగి ఉన్న హిజ్రాల్తో జగన్ పరిస్థితి చాలా ఇబ్బందిగా ఉంది. జేబు తడిమి చూసాడు. చిల్లర లేదు. పర్సు తీసి పది నోటిచ్చి పరిశీలనగా చూసాడు.

కృత్రిమమైన అందాల్ని కుదుర్చుకున్న మోహినీ స్వరూపాలు. సంప్రదాయ చీరకట్టులో ఇద్దరు. పంజాబీ డ్రెస్‌లో ఇద్దరు. విరబోసుకున్న జుత్తుతో పాటు వేలాడుతున్న పూల దండలు. పెదాల్నిండా పూసుకున్న ఎర్రటి లిపిస్టిక్ ముద్ద. ముక్కుపుటాన్ని చెండాడుతున్న చౌక బారు సెంటు వాసన. పాన్‌గుట్కా నముల్తూ నోళ్ల. ఒలికిపోయిందేదో వెతుక్కుంటున్నట్లు కళ్లల్లో అస్పష్టమైన భావాలు.

జగన్ ఆలోచనలను రెచ్చగొడ్తూ అతని కాలి పై కాలుంచి తొక్కి పట్టి కన్ను గీటి సుతారంగానవ్వాడొక హిజ్రా.

"ఇంత మందున్నాం! పది చాలదు బావా! పది రూపాయలకేం వస్తాది చెప్పు?" అని ముద్దుముద్దగా పలికిందో హిజ్రా. పాపం! వీళ్లనెవ్వరూ పన్లో పెట్టుకోరు! వేరే ఆదాయం లేదు. వేరే వృత్తి లేదు. యాచన తప్పదు మరి. లోలోనే అనుకుని మరో పది చ్చాడతను. పది నోటు ఆత్రంగా అందుకుని, బుగ్గ గిల్లి ముద్దుపెట్టుకుని – 'ఐ లవ్ యు' జగన్ బావా!' అన్నాడా హిజ్రా.

"ఆగాగు ! ఎక్స్ట్రాలొద్దు" అంటూ అటూ ఇటూ కదిలి అయోమయంగా చూసాడు జగన్.

'తన పేరు జగన్నాయుడు! కానీ అందరూ జగన్ అనే పిలుస్తారు. ' నాపేరు వీడికెలా తెల్సింది?' అని తనని తానే ప్రశ్నించుకున్నాడు. 'ఎక్కడో చూసినట్టుంది' అని తనని తానే సర్దిపుచ్చుకున్నాడు. 'బహుశా వీడికి నేను తెలిసుంటాను' అని సమాధాన పర్చుకున్నాడు.

కొంచెం దూరం వెళ్లి ఆగిన హిజ్రా వెనక్కి తిరిగి వయ్యారంగా చెయ్యూపుతూ – నా పేరు కమల్! మళ్లీ ఈ రైల్లోనే కలుద్దాం!!" అన్నాడు.

విచిత్రంగా ఉంది జగన్‌కి. 'ఎవడు వీడు! వీణ్ణి మళ్లీ నేను కలవాలా. వీడి పేరు నేనడిగానా?? ఏవిటంత అవసరం?? ఎందుకంత చొరవ?? కలిసేంత దగ్గర తనమా??" అని లోలోనే అనుకుంటూ నవ్వుకున్నాడు.

ఎదుటి సీట్లో వాళ్లూ, పక్కసీట్లో వాళ్లూ జగన్ని నిశితంగా పరిశీలించి చూస్తున్నారు. జగన్ నేనలాంటి వాణ్ణి కాదన్నట్టు తత్తరపాటుతో ఇబ్బందిగా కదిలాడు. 'ఖర్మ' అని విసుక్కున్నాడు.

* * *

కొండంత ఉత్సాహానికి ఆకాశానికి వినిపిస్తాయ్ కేకలు. పిసరంత ఆవేశానికి మైకంలో ముంచెత్తే పార్టీలు. యువతకు అందుబాటులో పబ్‌లు బార్‌లు డిస్కో తెక్‌లు. ఒకటేవిటి? అందనివంటూ లేవు! రాత్రయితే చాలు మద్యం మత్తులో మునిగి తేలుతుంది పట్టణం. అయిదారు పెగ్గులు పైగా లాగించిన జగన్ నడిరోడ్డు మీద జులాయి వెధవల్తో గొడవ పడ్తున్నాడు. గొడవకు తుదీ మొదలూ లేవు. పచ్చిగా గొడవ పడి ఉన్నకాడికి దోచుకునే జులాయిల్లా ఉన్నారు అవతలివాళ్లు. పోలీస్ విజిల్ వినిపించిందే తడవుగా జగన్‌తో గొడవ పడిన వాళ్లు ఉడాయించారు. కమల్ ధ్యాసంతా జగన్ మీదే ఉంది. ఊగుతూ జోగుతూ నేలపై

వాలిపోయాడతను. ఎక్కడున్నాడో మర్చిపోయాడు. తనెవరో మర్చిపోయాడు. అతని శరీరంలో అణువణువూ నిశ్శబ్దంగా నిద్రిస్తోంది. ఎలాగోలా శ్రమించి ఆటో ఎక్కించి తన గూటికి చేర్చాడు. ముసురుతున్న దోమల్ని మస్కిటో కాయిల్ వెలిగించి చెదరగొట్టాడు. వత్తిల్లి పడుకున్న జగన్‌కి దుప్పటి కప్పాడు. ఆవులించాడు. మూత పడుతున్న కళ్లలో జగన్ పక్కనే వొరిగిపోయాడు కమల్.

*   *   *

మత్తు విరిగిన కనురెప్పలు విప్పిచూసాడు జగన్. రాత్రి కొట్టిన మద్యం వల్ల తల చాలా బరువుగా ఉంది. తన గుండెలపై తలాన్చి పడుకున్న కమల్ని తోసి 'నేనెక్కడున్నాను?' అన్నాడు. చూస్తే పూరి గుడిసె. చెక్క మంచం కప్పుకున్నది కంపు దుప్పటి. తనని పెనవేసుకు పడుకున్నది హిజ్రా .

'ఛీ!' కంపరం పుట్టి చివాల్న లేచాడు. అతని విసురుకి కమల్ కూడా లేచాడు.

'నేను ! నేనే నిన్నిక్కడకు తెచ్చాను. 'కోపంతో ఉన్న జగన్‌తో అన్నాడు. "……" అయోమయంగా ఉంది జగన్‌కి.

"నన్ను… నువ్వు గుర్తుపట్టావా?" కమల్ అన్నాడు.

" ఆరోజు రైల్లో.. కమల్ నువ్వేనా?"" తలూపాడు కమల్.

'సర్లే!' అని కదలబోతూ తన చేతి కేసి చూసుకున్నాడు. వాచీ లేదు. ఉంగరం లేదు. మెడ తడుముకున్నాడు. చైన్ లేదు. జేబు తడుముకుంటే పర్స్ …. సెల్ కూడా లేదు.

'ఒళ్లు తేలీని స్థితిలో ఎవరైనా దొరికితే దోచుకోడానికి సిద్ధంగా ఉంటారు కొందరు. ఇదిగో! ఈ చిక్కంలో మీ వస్తువులన్నీ దాచాను. అన్నీ ఉన్నాయి. జాగ్రత్త చేసుకోండి!" అని అందించాడు కమల్.

అందుకుని చూసాడు జగన్. అన్నీ ఉన్నాయి. కృతజ్ఞతగా, మెచ్చుకోలుగా నవ్వుతూ వందనోటివ్వబోతే వద్దని వారించాడు కమల్.

"నన్ను నవ్వింకా గుర్తు పట్టలేదుకదూ? నేను కమలాకర్ని! నీతో పాటూ చిన్నప్పట్నించి ఇంటర్ వరకూ చదువుకున్నాను!"

'నిశిత పరీక్షతో చూసాడతను. ఔను! కమలాకరే!' అమ్మాయిలా వంకర్లు తిరిగి పోయే కమలాకర్! చేతులూపుకుంటూ వయ్యారంగా తిరిగే కమలాకర్! ఆడవాళ్లలా మృదువుగా మాట్లాడే కమలాకర్! స్నేహితులందరం ఒకచోట చేరి కమలాకర్‌ని ఎంత ఆట పట్టించే వాళ్లం!

'అరె! అరరే!! ఇదేంట్రా!" ఆశ్చర్యంగా అన్నాడు జగన్.

'యుక్తవయసొచ్చాక నాలో, ఏదో అంతర్మధనం! నా శరీరం మగతనంతో నా మనసు ఆడతనంతో గిలగిలలాడిపోయేది. దేవుడు నాతో చిత్రంగా ఆడుతున్నాడనిపించేది. ఎందుకిలా జరిగింది? దేవుడా! నన్నో పిచ్చోడిగానో, మూగోడిగానో కురూపిగానో పుట్టించక పోయావా? నీలాంటోళ్లందరూ నన్ను ఆడంగని ఆటపట్టిస్తుంటే నా మనోవైకల్యం మరింత పెరిగి లోలోన కుమిలిపోయేవాణ్ణి. ఇంట్లో అమ్మా నాన్న కూడా నన్ను వేధించేవారు. నా సమస్యకు పరిష్కారం తోచలేదు. ఇంట్లో డబ్బులు అందిపుచ్చుకుని హైదరాబాద్‌కి ఎగిరిపోయాను! ప్రస్తుతం నువ్వు చూస్తున్నావుగా! జీవచ్ఛవంలా బతుకుతున్నాను!" ముగించాడు కమల్? కాసేపు మౌనంగా ఉండిపోయారు ఇద్దరూ.

"నువ్వు హైదరాబాద్ వెళ్లిపోయాక ఇక్కడేం జరిగిందో తెల్సా? మీ అమ్మ నాన్నలు పోలీస్ కంప్లయింట్ ఇచ్చారు. తోటి విద్యార్థులందరూ నిన్ను రాగింగ్ చేసి చంపి వుంటారని మమ్మల్ని పోలీసులు ఎంతో టార్చర్ పెట్టారు. అసలు నువ్వేమై పోయావో తెలీక మీ అమ్మనాన్న మేం కూడా ఎంత బెంగటిల్లాం?"

"జగన్! నేనిలా అయ్యానని హైదరాబాద్‌లో ఉన్నానని పెద్ద హిజ్రా ఒకరు మా నాన్నగార్కి ఫోన్లో చెప్పి, నన్ను ఇంటికి పోయి బాగా చదువుకోమని చెప్పారు. నాకు చాలా విధాలుగా క్లాస్ పీకి నన్ను నేనే నియంత్రించుకుని హాయిగా బతకమన్నారు. ఇంటికి చేరిన నన్నూ నా వాలకాన్నీ చూసిన నాన్నగారు – 'నువ్వు చచ్చావనుకున్నాం! పో ఇక్కణ్ణించి' అని గెంటేసారు.

"………"

'నాలాంటి దౌర్భాగ్యుల్ని చూసి నవ్వుతారు. ఛీదరించుకుంటారు! మా గమనం ఎంత దుర్భరమో ఎవ్వరైనా ఆలోచిస్తారా! కనీసం పశు వుల మీద చూపే జాలైనా చూపించరు! ఇటు సమాజం అటు ప్రభుత్వం పట్టించుకోనివాళ్లం మేమే!" ముగించాడు కమల్.

జగన్ లేచి వెళ్లిపోబోతుంటే అడ్డుపడి వెక్కి వెక్కి ఏడుస్తూ వాటేసుకున్నాడు కమల్. రెండు చేతుల్లో పొదివి పట్టి 'ఊరుకోరా! కమల్! ఊరోకో!!' అని వారించాడు. గుండెలకు మరింతగా హత్తుకుని 'నీ మీద బెంగతో మీ అమ్మ ఈ మధ్యనే చనిపోయిందిరా కమల్!' అని చెప్పబోయి తమాయించుకుని ఆగిపోయాడు.

'ఒకేరా కమల్!' అని నాలుగడుగులు ముందుకు కదిలాడు జగన్. చేతుల్లో ముఖం దాచుకుని ఏడుస్తున్న కమల్ని చూసిన జగన్ మళ్లీ వెనక్కి వచ్చాడు.

'కమల్! నువ్వు సెక్స్ మార్పిడి చేసుకున్నావా!" సూటిగా ప్రశ్నించాడు.

"లేదు!" దృఢంగా చెప్పాడు కమల్.

"అయితే నేను చెప్పేది వింటావా?"

చెప్పమని అభ్యర్థనగా చూసాడు కమల్.

"ప్రతి మగాడిలోనూ ఆడతనం అమ్మతనం ఉంటాయి. మగాడిలో ప్రేమ, అనురాగం, ఆప్యాయత, ఆర్ధ్రత అన్నీ ఆ రవ్వంత ఆడతనం నుండే పుట్టుకొస్తాయి! ఆ ఆడతనమే ఎక్కువ పాళ్లలో మగాడిలో ఉండే ఆడంగితనం! దాన్ని రూపు దాటించడం కొంచెం కష్టమే! కానీ మాటివ్వగలవా కమల్!' అని చేయిచాచాడు జగన్.

జగన్ చేతిపై కమల్ చెయ్యుంచాడు.

కమల్ ! నువ్వు మగాడివి! మగాళ్ల మధ్య మగాడిలా మసలాలి! నేను చెప్పినట్టు విని నాలాగా నువ్వు మసలుకోవాలనిపిస్తే నాతోరా! ఏవంటావ్! నీకు సైకలాజికల్ ట్రీట్‌మెంట్ ఇప్పిస్తాను. సైకాలజీ కౌన్సిలింగ్ క్లాసులు ఏర్పాటు చేస్తాను! ఫిజికల్‌గా మూమెంట్స్ ట్రైనింగ్ ఇప్పిస్తాను. జిమ్‌లో చేర్పించి బాడీకి తగిన ఎక్సర్‌సైజులు చేయిస్తాను. మెంటల్‌గా ఏకాగ్రత కోసం యోగా ధ్యానం చేయిస్తాను. దర్జాగా మగాడిలా మొనగాడిలా బతికేలా ఎంత డబ్బయినా ఖర్చు చేస్తాను!

పైగా నువ్వు కోటీశ్వరుడి కొడుకువన్న సంగతే మర్చిపోయి ఇంత దైన్యంగా దయనీయంగా బతకడవేవిటి? చెప్పు!!"

కమలాకర్ కళ్లు పెద్దవై మిలమిలా మెరిసాయి! ఏదో నవ చైతన్యం అతని ఆలోచనల్లో ఆనంద తాండవం చేస్తూ భవిష్యత్తులోకి లాగుతోంది! ఇది అవాస్తవం కాదు! ఇది అసాధ్యం కాదు!! ఇది కల కాదు! కమలాకర్ పెదవులపై చెదరని చిరునవ్వుపై మొలకెత్తిన మీసాలు నిక్కబొడుచుకున్నాయ్! వాస్తవం కళ్ల ముందు నిశ్చలనమై నిలుచుంది!

కమలాకర్ ఆ క్షణాల్ని చేజార్చుకోదలచుకోలేదు! చేతికున్న గాజుల్ని తీసి నేలకేసి కొట్టాడు! చెవుల కమ్మల్ని లాగిపడేసి నదుట బొట్టు లాగేసాడు! తలపై పెరిగిన జుత్తుని ఒత్తిపట్టి బరబరా కత్తించేసాడు! ఒంటిమీద జీరాడుతున్న చీరని లాగి ఎప్పటిదో పాత ప్యాంటూ షర్ట్ తీసి వేసుకున్నాడు.

'కమల్! నాతో పదరా!' అని చేయి పట్టుకులాగాడు జగన్. తూర్పు కభి ముఖంగా వాళ్లిద్దరూ ముందు ముందుకు కదిలిపోతున్నారు! ఒకప్పుడు అమ్మ కమ్మని కడుపు పండి పుట్టాడు. కమలాకర్!

ఇప్పుడు! ఆడతనం నుండి కమలాకర్ మొనగాడుగా పుట్టబోతున్నాడు!

- యల్. రాజా గణేష్,

ఫోన్ : 9247483700.

స్ఫూర్తి

ఆమెను చూస్తే పొగరుబోతు ఏనుగులకు హడల్. వాటిని పట్టుకుని మచ్చిక చేసిందో ... అంతటి భారీకాయులు కూడా సాధుజంతువుల్లా మారిపోయి... ఆమె ఎలా చెప్తే అలా వినేస్తాయి. ఇది ఎలా సాధ్యమంటే! ఏనుగుల పట్ల ఆమెకున్న అపారమైన ప్రేమ వల్లే విధి నిర్వహణలో వుంటే రంగు వెలసిన జీన్స్ ప్యాంటు, చొక్కా వేసుకుంటుంది. నెత్తిమీద టోపీ, ఎండకు చలువనిచ్చే కళ్లజోడు, నడుమున బెల్టు... ఇదీ ఆమె ఆహార్యం. అదే డ్యూటీలో లేకపోతే... అస్సాం సంప్రదాయ దుస్తుల్లోనో... చీరలోనో ...సాదాసీదా మహిళగా అగుపిస్తుంది. ఈ ఉపోద్ఘాతం చాలు... ఆమెకు గజరాజులంటే ప్రాణమని చెప్పడానికి.

ఏకైక మహిళా మావటి ప్రభాతి బారువ

ఇప్పటి వరకు చెప్పుకున్న వివరాలన్నీ ప్రబాతి బారువ అనే మహిళకు సంబంధించినవే. ఐదుపదుల వయసు పైబడిన ఈమెకు ఇప్పుడే కాదు. పసితనం నుంచీ ఏనుగులంటే మహా ఇష్టం. నిజానికి ఏనుగుల పట్ల అంత ప్రేమాభిమానాలు కలగడానికి కారణం ఆమె తండ్రి లాల్జీనే. అస్సాంలోని గౌరీపూర్‌కు చెందిన రాజుల కుటుంబం వీరిది. అన్నిటినీ మించి ప్రబాతి గౌహతి యూనివర్సిటీలో రాజనీతి శాస్త్రంలో పట్టభద్రురాలు. మరి ఇంత ఉన్నత కుటుంబంలో పుట్టి...అంత చదువు చదువుకొని ... ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ, చలికి వణుకుతూ...క్రూర మృగాల దాడులకు కాచుకుంటూ... అడవుల్లో మదపుటేనుగుల మధ్య బతకటమేంటనేది అర్థంకాని ప్రశ్న?

నాన్న ఇచ్చిన స్ఫూర్తితోనే...

పసిగుడ్డుగా వున్నప్పటి నుంచీ ప్రబాతి ఏనుగుల మధ్యే గడపాల్సి వచ్చింది. నెలల పాపగా వున్నప్పుడు తొలి ప్రయాణం చేయాల్సివచ్చింది. అదీ షిల్లాంగ్ నుంచి గౌరీపూర్ చేరుకోవడానికి. కుటుంబంతో కలిసి దగ్రాలోని ఏనుగుల క్యాంపులో మకాం వేయాల్సి వచ్చింది. లాల్జీ, ఆయన నలుగురు భార్యలు, పిల్లలు, ఒక వైద్యుడు, దర్జీ, 70 మంది పనివాళ్లు క్యాంపులో బస చేసిన వారిలో వున్నారు. అస్సాంలోనే కాక, ఇరుగు పొరుగు రాష్ట్రాలలో కూడా మదపుటేనుగులు, పొగరుబోతు ఏనుగులను జనావాసాల నుంచి అడవుల్లోకి తోలడానికి లాల్జీ ఎంతో ఆసక్తి చూపించేవారు. తాము మచ్చిక చేసుకున్న ఏనుగులను అందుకు ఉపయోగించేవారు.

నిజానికి ఆయనకు తన మీద కంటే కూడా ఏనుగులంటేనే ఇష్టం. వాటికి స్నానం, మర్దన, ఆహారం తయారుచేయడం దగ్గర నుంచి అన్నీ దగ్గరుండి చూసుకునేవారు. దాంతో పసితనం నుంచి ప్రబాతికి కూడా ఏనుగులంటే ఆసక్తి ఏర్పడింది. అందరు పిల్లలు బొమ్మలతో, తోటి పిల్లలతో ఆడుకుంటుంటే ప్రబాతి మాత్రం ఏనుగులతో గడిపేది. ఆట, పాట, మాట అన్నీ వాటితోనే.



తెల్లారుజామునే లేచి తండ్రితో పాటు ఏనుగులకు ఆహారాన్ని సిద్ధం చేసేది. గడ్డి, అరటిపళ్లు, ఉప్పు, బెల్లం, చెరకులు, పెసలు, మూలికా ద్రవాలు... వంటివి వాటి ఆహారంగా ఇచ్చేవారు. వాటికేమైనా ఆరోగ్య సమస్యలొస్తే చికిత్స చేసేవారు. సాయంత్రం వేళల్లో తండ్రి, మావటులు, ఇతర సిబ్బంది కూర్చుని ఆరోజు జరిగిన విషయాలను చర్చించుకునేవారు. వారి మాటలు ఎక్కువగా ఏనుగుల చుట్టూనే తిరిగేవి. వాటిని నియంత్రించడంలో వచ్చిన సాదకబాధకాలు...మంచీ చెడ్డా అన్నీ దొర్లేవి. పచ్చటి అడవి అనే విశ్వవిద్యాలయంలో చదువుకున్న మంచి విద్యార్థిని ప్రబాతి.

పద్నాలుగేళ్ల వయసులో ఒక పొగరుబోతు ఏనుగును మొదటి సారిగా పట్టుకుంది ప్రబాతి. తన కూతురు ప్రదర్శించిన ధైర్యసాహసాలను చూసిన లాల్జీ ఎంతగానో మురిసిపోయాడు. కూతురు భుజం తడుతూ మెరుస్తున్న కళ్లతో 'శభాష్ బేటీ' అన్న రెండు మాటలు ఇప్పటికీ గుర్తే ప్రబాతికి. వ్యక్తిగత వివరాలు చెప్పడానికి పెద్దగా ఇష్టపడని ఆమె 'లక్ష్మీమాల, కాంచనమాల, అలోక' అనే ఏనుగులనే కన్నబిడ్డల్లా చూసుకుంటుంది. వాటిని తల భాగం వరకు తెల్లటి పిండితో ముగ్గులు వేసి అలంకరించడమంటే ఆమెకెంతో ఇష్టమైన పని. గ్రామాల మీద పడి ప్రజలను భయభ్రాంతులను చేసే మదపుటేనుగులను ఆవాసాలకు దూరంగా అడవులకు తోలడంలో తండ్రిని మించిన నేర్పరి ప్రబాతి. ఏనుగులు ఫుట్ బాల్ ఆట అడేందుకు కూడా శిక్షణ ఇచ్చేది. అయితే కొన్ని సంస్థలు దీన్ని తప్పుపట్టి...ఈ శిక్షణ వెనక అవి ఎంతో హింస అనుభవించాల్సి వస్తుందంటూ నిషేధం విధించేవరకు పట్టుపట్టాయి. అయితే ఏనుగులకు శిక్షణ అంటే కొట్టి, బాధించి ఇవ్వనవసరం లేదనీ, వాటి మనస్తత్వాన్ని అర్థం చేసుకుంటే సులభంగా ఏదైనా నేర్పవచ్చునీ అంటారామె. రాజస్థాన్, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో ఎండాకాలం ఎర్రటి ఎండల్లో ... తారు రోడ్లమీద విదేశీయులను మోసే ఏనుగులు ఎంతగా గాయపడతాయో, వాటి కాళ్లకు ఎన్ని పుళ్లు అవుతాయో తెలియదా? అని ప్రశ్నిస్తారామె.

ప్రబాతి గురించి తెలుసుకున్న మార్క్ షాంద్ అనే రచయిత మూడు నెలల పాటు ఆమెను నీడలా వెన్నంటి వుండి నేషనల్ జియోగ్రాఫికల్ చానల్ కోసం ఒక డాక్యుమెంటరీ తీసిపెట్టాడు. అంతటితో ఆగక 'క్వీన్ ఆఫ్ ఎలిఫెంట్స్' అనే పుస్తకం కూడా రాశాడు. ఈ పుస్తకానికి పలు అవార్డులు కూడా అందుకున్నాడాయన. ✦

నిఘంటువునే బట్టీ పట్టేస్తే...

యాభై ఒక్కేళ్లంటే...
దాదాపుగా జ్ఞాపకశక్తి తగ్గిపోయే దశ. ఆ వయసులో లీ యాంగ్జి అనే చైనీస్ ప్రొఫెసరమ్మ ఒక సాహసకృత్యం చేసింది. అదేంటంటే... ఏకంగా 220,000 పదాలున్న 2,458 పేజీల నిఘంటువుని బట్టీపట్టేసింది. ఏ పదం గురించి అడిగినా టకీమని అర్థం చెప్పేస్తుంది. ప్రతి రోజూ తెల్లారుజామున మూడు గంటల నుంచి ఆరు గంటల వరకు నిఘంటువును చదివేది. ఏ ఒక్కరోజూ బద్ధకించేది కాదు. నిఘంటువు పఠనాన్ని 2013 ఆగస్టులో ప్రారంభించింది. తొలి పంతొమ్మిది రోజుల్లోనే మొదటి రీడింగ్ అయిపోయింది. ప్రస్తుతం ఆ నిఘంటువులోని ఏ పేజీలో ఏ మూలన వున్న పదాన్ని అడిగినా వాటి అర్థాలు లీ నోటెంట దొర్లుకుంటూ వచ్చేస్తాయంతే. అంతేకాదండోయ్! ఫ్రెంచి, రష్యన్, జర్మన్, జపనీస్, పోలిష్...వంటి మరో పది భాషల మీద కూడా లీ మేడమ్‌కు పట్టు వుంది. ఇంతకీ ఈ వయసులో ఇంత భారాన్ని ఎందుకు నెత్తిమీద పెట్టుకుందీ అంటే... అనువాదాలు చేసి డబ్బు సంపాదించడానికట. ఇరవయ్యేళ్ల కిందట భర్త నుంచి విడాకులు తీసుకోవడం, పైగా తన ఇరవై ఆరేళ్ల కుమారుడు మూగతనంతో సొంత పనులు కూడా చేసుకోలేకపోవడంతో మరింత డబ్బు అవసరమైంది. అందుకు ఈ మార్గాన్ని ఎంచుకుంది లీ.

◆ **వింత లోకం**

క్రిమికీటకాలే ఆహారం

రకరకాల వంటకాలను రుచి చూసి వుంటారు. పంది మాంసం, గొడ్డు మాంసం ... వంటివి మామూలే ఎవరికైనా. కానీ పాకే, ఎగిరే పురుగులు, కీటకాలను ఆహారంగా చేసుకున్న వారి గురించి విని వుండరు. కామెరాన్ అనే అమెరికా విద్యార్థి ముప్పై రోజులపాటు ఈ ఆహారాన్ని విజయవంతంగా లాగించేశాడు. అతను ఇది తిన్నాడు. ఇది తినలేదు. అని చెప్పలేని విధంగా అన్ని రకాల పురుగుల్ని రుచిచూశాడు. ఆఖరుకు పట్టుపురుగు గుడ్లను కూడా తిని చూశాడు. కాకపోతే అతనికి నచ్చలేదట. అందుకే వాటిని విడిచిపెట్టాడు. గుడ్లు, బర్గర్లు, ఫ్రైడ్ రైస్ వంటి వాటితో రుచికరంగా వుండుకున్న ఈ పురుగులను కలుపుకుని తినేవాడట. మనకు సాధారణంగా దొరికే ఆహారానికి లోటు వచ్చినప్పుడు ఇలాంటి ఫుడ్డు తప్పదేమో!

వరాహ భక్తి!

అప్పుడప్పుడు ఇలాంటివి జరుగుతూనే వుంటాయి. పాములు గుళ్లలోకి జొరబడి విగ్రహాలను చుట్టుకుని కదలకుండా వుండిపోవడం, కాకులు, పందులు ఆలయాల్లోకి వచ్చేసి విగ్రహాల చుట్టూ ప్రదక్షిణలు చేయడం పత్రికల్లో, చానళ్లలో అడపాదడపా చూస్తూనే వుంటాం. అలాంటి ఘటనే ఇటీవల చైనాలోనూ చోటుచేసుకుంది. ఒక పంది బౌద్ధాలయం దగ్గరకు చేరుకొని ముందరి కాళ్లను, ముట్టెను నేలకు ఆన్చి... వెనక కాళ్ల మీదే నిలబడిపోయిందట. అది చూసిన భక్తులు ఫొటోలు, వీడియోలు తీసి అంతర్జాలంలో పెట్టేశారు. ఇక చూస్కోండి వరాహ భక్తికి విశ్వవ్యాప్త ప్రచారం లభించింది. అసలు ఆ పంది అక్కడ ఆ ముద్రలో ఎందుకు నిలబడిపోయిందో... ఏంటో ... ఎవరికీ తెలీదు కానీ... ప్రచారం మాత్రం బాగానే వచ్చేసింది. ✦

సినిమా కబుర్లు

భారతీయ చలన చిత్ర రంగంలోనే అతి ప్రసిద్ధమైన వంశంలో అత్యున్నతమైన దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు పొందుతున్న మూడవ వ్యక్తి. అందం అభినయం అభిరుచి మేళవించిన అరుదైన కళా హృదయుడు. పరస్పర వైషమ్యాలకు మారుపేరైన సినీ రంగంలో అనేకులకు సన్నిహితంగా మెలిగిన స్నేహశీలి. అనేక హాలివుడ్ చిత్రాల్లో నటించిన తొలి భారతీయ నటుడు. ఇలా చెప్పుకుంటూ పోతే శశి కపూర్ ప్రత్యేకతలు చాలా వున్నాయి. 70 ఏళ్ల కిందట అంటే 1940లలో నటనా రంగంలో కాలూనిన శశికి ఫాల్కే అవార్డు ఆలస్యంగా వచ్చిందనేవారుంటురేమోగాని ఆక్షేపించేవారు ఒక్కరైనా వుండరు. అసలు కళాకారులు చక్రాల కుర్చీలోకి చేరితే గాని ఫాల్కే ప్రకటించరా అని ఒకపత్రిక విమర్శా వ్యాసం కూడా రాసింది!

అందం..అభినయం

-వీపీ

తండ్రి పృథ్వీరాజ్ కపూర్, పెద్దన్న రాజ్‌కపూర్(మరో అన్న షమ్మీ కపూర్) నీడలో శశి పసి ప్రాయంలోనే నటుడు కావడం పెద్ద ఆశ్చర్యమేమీ కాదు. పృథ్వీ థియేటర్ ప్రదర్శించే నాటకాలలో ఆయన రకరకాల వేషాలు వేసేవాడు. చలన చిత్ర ప్రవేశం మాత్రం 1948లో రాజ్‌కపూర్ ఆగ్‌లో చిన్నప్పటి రాజ్‌గా. ఆ తర్వాత ఆవారాలో. హీరోగా తొలి చిత్రం ధర్మపుత్ర. 1961లోధర్మపుత్రలో తొలిసారి హీరో వేషం కట్టాడు. తన మత నేపథ్యం గురించి గందరగోళపడే పాత్ర అది. మరో రెండేళ్లకే ఇంగ్లీషు చిత్రం ' ద హౌస్ హోల్డర్'లో నటించే అవకాశం వచ్చింది. అప్పటికే నవీన యుగ నాయికగా పేరొందిన లీలానాయుడుతో. దూకుడుకు మారుపేరైన భార్యతో సర్దుకునే యువకుడుగా శశి చాలా సుతారంగా నటించి తనేమిటో నిరూపించుకున్నాడు. ఆ తర్వాత కాలంలో ఇస్మాయిల్ మర్చంట్, జేమ్స్ ఐవరీలు నిర్మించిన ఇంగ్లీషు చిత్రాలన్నిటిలోనూ శశి నటిస్తూ వచ్చాడు.

ఆ క్రమంలోనే 1956లో హాలివుడ్ నటి జెన్నిఫర్ కెండాల్ పరిచయం. 1958లో పరిణయం వరకూ వెళ్లింది. గొప్ప నటులైనా స్థూలకాయం శాపంలా వెన్నాడే కపూర్ల వంశంలో పుట్టిన శశి అలా కాకుండా ఆమె శత విధాల జాగ్రత్తలు తీసుకోవడంలో సఫలీకృతమైంది. అయిదవ పడిలో కూడా అందంగా కనపడేలా చేయగలిగింది! వీరిద్దరూ కలసి చాలా చిత్రాల్లో నటించారు కూడా.



ఏకంగా 118 చిత్రాల్లో నటించిన శశి విజయాలు విశేషాల జాబితా చాలా పెద్దది. ఆయనచిత్రాల్లో గ్లామర్ రొమాన్స్ మ్యూజిక్ ప్రత్యేకంగా వుంటాయి. హీరోయిన్ల ఇష్ట కథానాయకుడు కూడా. అందులోనూ 8 చిత్రాల్లో జంటగా కనిపించిన నందాను ప్రత్యేకంగా చెప్పుకో వాలి. శశికపూర్‌ను ఫ్లాప్ హీరోగా పరిగణించి పక్కన ఎవరూ నటించేందుకు సిద్ధపడని రోజుల్లో పక్కనుండి ప్రోత్సహించింది అందాల నందా. వారి తొలి చిత్రం జబ్ జబ్ ఫూల్ ఖిలే ఆల్‌టైం హిట్.మొహబత్ ఇస్‌కో కహతే హై, రాఖీ వంటివి కూడా బాగా పేరు తెచ్చాయి. వారిద్దరూ ఒకరిపై ఒకరు ప్రశంసలు కురిపించుకున్నారు. ఇక తర్వాత స్థానం షర్మిలా టాగూర్‌ది. వాటిలో సుహానా సుహాగ్, వక్త్, ఆగలే లగ్జా (తెలుగులో శోభన్ బాబుతోమంచి మనుషులు), వంటివి వున్నాయి. వాదా కరో నహీ చోడెగా తు మెరే సాథ్ ఆ గలే.. చిత్రంలోదే. ఆయనతో ఎక్కువగా నటించిన మూడవ హీరోయిన్ రాఖీ. షర్మిలీ సూపర్ హిట్‌తో మొదలైన ఈ జంట తర్వాత కభీ కభీలో గొప్పగా ఆకర్షించింది. షర్మిలీలో పాట 'ఖిల్‌తెహై గుల్ యహా' రాగం దృశ్యం కూడా మరచిపోలేనంత మధురమైనవే. కభీ కభీ మెరె దిల్ మే జేసుదాసు పాట చెప్పనవసరం లేదు. ఆ చిత్రంలో గత ప్రేమికుడైన మరో వ్యక్తి(అమితాబ్ బచన్)ను ప్రేమించే భార్య(రాఖీ)ని అభిమానంగా చూసుకునే సంస్కారవంతమైన భర్తగా శశి ప్రతిభావంతంగా నటించాడు. హేమమాలినితోనూ జీనత్ అమన్‌తోనూ కూడా ఆయన నటించాడు.



హీరోయిన్ల పక్కన నటి ంచడం అటు ంచి హీరోలలో అమితాబ్‌తో శశి కపూర్ కాంబినేషన్ ప్రత్యేకత. కభీ కభీ, త్రిశూల్, దీవార్, కాలా పత్థర్, షాన్, దో ఔర్ దో పాంచ్ ఇలా వీరిద్దరితో అనేక విజయవంతమైన చిత్రాలు వచ్చాయి.ఒకప్పుడు రోటీ కప్‌డా ఔర్ మకాన్‌లో అమితాబ్‌ది చాలా చిన్న పాత్ర కాగా శశి ప్రధాన హీరోల్లో ఒకరు. తర్వాత ఈ పరిస్థితి తలకిందులై అమితాబ్ ప్రధానాకర్షణగా వున్నా రెండవ హీరోగా కనిపించేందుకు శశి వెనుకాడలేదు. అమితాబ్‌ను శిఖరాగ్రానికి చేర్చిన దీవార్ చిత్రంలో ఆ అన్న దమ్ముల డైలాగ్ ఇప్పటికి భారతీయులు మర్చిపోరు. 'నా దగ్గర డబ్బు సంపద అన్నీ వున్నాయి. నీ దగ్గరేముంది'అని స్మగ్లర్‌గా మారిన అన్నయ్య అన్నప్పుడు ఇన్‌స్పెక్టర్ తమ్ముడుగా శశి కపూర్ నా దగ్గర అమ్మ వుంది'(మేరా పాస్ మా హై) అని చెప్పే డైలాగ్ అది. అమితాబ్ కన్నా పెద్దవాడైనప్పటికీ తమ్ముడుగా నటించడానికి ఆయన దేహాకృతితో పాటు మనస్థితి కూడా సరిపోయింది. వీరి కాంబినేషన్‌పై హాస్యంగా కొందరు అమితాబ్‌కు బాగా ఇష్టమైన హీరోయిన్ శశి కపూర్ అనేవారు!

శశికపూర్ నటించిన 118 చిత్రాల్లోనూ సోలో హీరోగా 61, మల్టీస్టారర్లు వున్నాయి. 60,70 దశకాలలోనూ 80 వ దశకం ప్రథమార్థంలోనూ ఆయన విపరీతంగా నటించేశాడు. ఆఖరుకు రాజ్‌కపూర్ స్వంత

తరువాయి 20 వ పేజీలో..

నవ్వుల్ – పువ్వుల్

పిచ్చిగీతలు



(ఒక మోడ్రన్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో ఓ చిత్రం ముందు పల్లెటూరి ఆసామి కన్నీళ్లు తుడుచుకుంటున్నాడు.)

చిత్రకారుడు: ఈ బొమ్మ మీకు బాగా నచ్చిందాండీ.

వ్యక్తి: ఈ బొమ్మలు చూస్తుంటే చనిపోయిన మా చిన్నబ్బాయి గుర్తొస్తున్నాడు. వాడు కూడా గోడలమీద ఇలాగే పిచ్చి గీతలుగీసేవాడు

బహుమతులు

టీచర్ : గోపీ! మీఇంటికి వచ్చే చుట్టాలు మీకేమైనా బహుమతులు తెస్తారా?

గోపీ : ఈ మధ్య మా నాన్నకు దగ్గు, మా అమ్మకు తలపోటు, నాకేమో చర్మ వ్యాధులు బహుమతులుగా ఇచ్చారు టీచర్!

గాఠ్ఠి...

కస్టమర్: నాకు మంచి పెన్సిల్ ఇవ్వండి.

షాపు వాడు: ఏది కావాలి? మెత్తటి లెడ్ వున్నదా? గట్టి లెడ్ వున్నదా?

కస్టమర్: గట్టిదే ఇవ్వండి. నా దగ్గర అప్పు తీసుకున్న వాడు ఎంతకీ తిరగి ఇవ్వడంలా. అతనికి ఒక భయంకరమైన ఉత్తరం రాయాలనుకుంటున్నాను.

వెరైటీ

విలేకరి : మీరు తీస్తున్న కొత్త సినిమా ప్రత్యేకతలు ఏంటి?

నిర్మాత : విలన్ తెలుగు వాడు. తెలుగు భాషలో అక్షరాలు, పదాలతో జిమ్మిక్కులు చేసే రచయితతో పాటలు, మాటలు రాయిస్తున్నాం. అదే మా సినిమా ప్రత్యేకత.

డిస్కౌంట్



జడ్జ్: నువ్వు ఈ కోర్టులో కనపడడం ఇది పదవసారి. నీకు వంద రూపాయలు ఫైన్ వేస్తున్నాను.

వ్యక్తి: జడ్జిగారు. నేను మీ రెగ్యులర్ కస్టమర్‌ని కదా. డిస్కౌంట్ ఏమీ వుండదా?

వాయించగలనా?

రోగి: డాక్టర్ గారూ ఈ ఆపరేషన్ తరువాత నేను పియానో వాయించగలనా?

డాక్టర్ : ఓ తప్పకుండా వాయించగలవు.

రోగి: భలే! నేను ఇంతకు ముందెప్పుడూ వాయించలేదు.

ఫూల్

భార్య: చూడు! నేను ఫూల్‌ని కాకపోతే నిన్ను పెళ్లిచేసుకునే దాన్నే కాదు.

భర్త: అవును. నేను కూడా విషయాన్ని ప్రేమ మైకంలో వుండి గమనించనేలేదు.

కాపీకొట్టావా?



టీచర్: రామ్! కుక్క గురించి నువ్వు రాసిన వ్యాసం మీ అన్నయ్య రాసిన వ్యాసం ఒకటిగా వుంది. నువ్వు దాంట్లోంచి కాపీ

రామ్: లేదు టీచర్. ఇద్దరం ఒకే కుక్క గురించి రాశాం.

అధికారులంటే వీరే

◆ స్ఫూర్తి

గత కొద్ది కాలంగా ప్రతిరోజూ పత్రికల్లో కనిపిస్తున్న పేరు డి.కె.రవి. కోట్లాది రూపాయల పన్నులు ఎగ్గొట్టే పెద్దల ముక్కు పిండి మరీ వసూలు చేసిన ఈ యువ ఆఫీసర్... విధి నిర్వహణలో భాగంగా అతితక్కువ కాలంలోనే పదులసార్లు బదిలీ లేఖలు అందుకున్నారు. అత్యంత నిజాయితీపరుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఈ ఐఎఎస్ అధికారి అనుమానాస్పద మృతిపై సర్వత్రా చర్చ జరుగుతున్న వేళ... నీతి నిజాయితీలకు నిలువుటద్దాల్లా నిల్చిన కొందరు అధికారుల గురించి తెలుసుకుందాం.

ఆఖరిదాకా అణగారినవారి కోసమే...

పూర్వ ఐఎఎస్ ఎస్.ఆర్.శంకరన్ ప్రజలు మెచ్చిన అధికారిగా గుర్తింపు పొందారు. పేదల అనుకూల నిర్ణయాలు చేయడంలో, వెట్టి కార్మికుల నిర్మూలన చేయడంలో, ఎస్సీ ఎస్టీలకు ప్రత్యేక ప్రణాళిక రూపకల్పనలో, గ్రామీణాభివృద్ధి కార్యక్రమాల్లో అట్టడుగు వర్గాలవారికి నిధులు కేటాయించడంలో గొప్ప చొరవ చూపారు. పైగా సమాజ సేవ చేయడానికి అడ్డుకాకూడదని బ్రహ్మచారిగానే వుండిపోయారు. 500 మంది పేద విద్యార్థుల చదువుకోవడానికి తన వంతు సాయం చేసిన విశాల హృదయుడు. 2010లో అనారోగ్యంతో మరణించినా ప్రజల మనిషిగా చిరస్థాయిగా గుర్తుండిపోతారు.

మహిళల భద్రతకే పెద్దపీట

2006వ బ్యాచికి చెందిన ఐపిఎస్ అధికారి శివదీప్ వామన్ లాండే. నిత్యం వార్తల్లో వుంటుంటారు. అనేకమంది నేరస్థులను అరెస్టు చేశారు. మహిళల భద్రతకు పెద్ద పీట వేశారు. అంతేకాదు. తన పదవీ కాలంలో ఔషధ రంగానికి చెందిన మాఫియాను కట్టడి చేయడమే కాక పాట్నాలో నేరాల రేటును గణనీయంగా తగ్గించారు. ఆడపిల్లలు, మహిళలను వేధించే, ఆటపట్టించే పోకిరి యువతపై గట్టి చర్యలు తీసుకున్నారు. దాంతో ప్రజల్లో ఆయనకు మంచి పేరుప్రతిష్టలు లభించాయి. పైగా రోజుకు వందలాది సమస్యలు ఫోన్లలో మెసేజీల రూపంలో ఆయనకు అందేవి. అన్నిటికీ పరిష్కారం చూపించే ప్రయత్నం చేసేవారు. తన పరిధిలో అక్రమ మందు షాపులను మూసివేయించడంలో ముఖ్యమైన పాత్ర పోషించారు. పాట్నా నుంచి అరారియాకు బదిలీ చేసినప్పుడు ... ప్రభుత్వ నిర్ణయానికి నిరసనగా...జనం వీదుల్లోకి వచ్చి కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. పేదలకు వివాహాలు చేయడం, స్థోమతు లేని వారికి హాస్టళ్లు కట్టించడం వంటి ప్రజాహిత కార్యక్రమాలకోసం తన జీతంలో 70 శాతం డబ్బును వెచ్చించేవారు.

అన్నీ 'పెద్దల' కేసులే

ఒక ఐఎఎస్ అధికారి అయి వుండి విధి నిర్వహణకు బస్సులో వెళ్లడానికి సైతం వెనకాడని నిరాడంబరుడు వి.వి.లక్ష్మీనారాయణ. సిబిఐ జాయింట్ డైరెక్టర్‌గా 19 మంది పెద్దల కేసులపై విచారణ చేశారు. సత్యం స్కామ్, గాలి జనార్ధన రెడ్డి అక్రమ గనుల తవ్వకం, ఆదాయాలకు మించి ఆస్తులను కలిగివున్న వై.ఎస్.జగన్మోహన్ రెడ్డి కేసు, షోహరుద్దీన్ నకిలీ ఎన్‌కౌంటర్ కేసు... వంటివే అన్నీ. జగన్, గాలి జనార్ధనరెడ్డి వంటి వారిని అరెస్టు చేయించడమే కాక అద్భుతమైన ప్రసంగం చేసి ఆకట్టుకున్నారు.

కల్తీని అడ్డుకోబోయి కానరాని లోకాలకు...

ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో సేల్స్ మేనేజర్‌గా పనిచేసిన సాహస అధికారి షణ్ముగం మంజునాథ్. కల్తీ చమురు అమ్మకాలను అడ్డుకోవడంలో ఎంతో తెగువ చూపారు. అతను ప్రదర్శించిన ధైర్యసాహసాలు, నిజాయితీ షణ్ముగంను గొప్ప అధికారిగా నిలబెట్టాయి. నిజాయితీకి పట్టం కట్టినందుకు భారీ మూల్యాన్నే చెల్లించుకోవాల్సి వచ్చింది. లక్నోలోని రెండు పెట్రోల్ పంపుల్లో కల్తీ ఆయిల్‌ను అమ్ముతున్నారన్న విషయాన్ని బైటపెట్టే క్రమంలోనే ప్రాణాలు కోల్పోవాల్సి వచ్చింది. ఆ రెండు పెట్రోలు పంపులను సీల్ వేయమని ఉత్తర్వులు జారీ చేయడంతో మూసి వేసినప్పటికీ తర్వాత తిరిగి అమ్మకాలు ప్రారంభించారు. దాంతో ఆకస్మిక తనిఖీ చేశారు. ఆరోజు రాత్రే తుపాకీ బుల్లెట్లకు బలై తన సొంత కారులోనే పడివున్నాడన్న వార్త తెలిసి దేశం యావత్తు ఒక్కసారిగా ఉలిక్కిపడిందనుకోవాలి.

మనసున్న అధికారి

మణిపూర్‌కి చెందిన యువ ఐఎఎస్ అధికారి ఆర్మ్‌స్ట్రాంగ్ పామె గురించి ఎక్కువమందికి తెలియకపోవచ్చు. మరింత మెరుగైన సమాజ నిర్మాణం కోసం అతనికున్న తపన, అంకిత భావం గురించి ఎంత చెప్పినా తక్కువే. మణిపూర్‌లోని కొండ ప్రాంతంలో వంద కిలోమీటర్ల రోడ్డును ప్రభుత్వ సాయం లేకుండానే వేయించిన ఘనత అతనిది. ప్రజలే పెద్ద ఎత్తున ముందుకు వచ్చి ఆ రోడ్డుకు రూపం ఇచ్చారు. పెడగా, అనాథగా పడున్న పర్వత ప్రాంతాన్ని రాష్ట్రానికి దగ్గర చేసిందీ రోడ్డు. తన స్వంత డబ్బును, జనం దగ్గర సేకరించిన నిధులను కలిపి ఆ రోడ్డును వేయించి...స్థానిక గ్రామీణుల దృష్టిలో మనసున్న మనిషిగా నిల్చిపోయాడు.

ఆఖరి దాకా మాఫియాతో పోరాటమే

ఐపిఎస్ అధికారిగా బీహార్‌లో తన కెరీర్‌ను ప్రారంభించిన నరేంద్రకుమార్ విధి నిర్వహణలో గొప్ప ధైర్యసాహసాలను ప్రదర్శించారు. అనంతరం మధ్యప్రదేశ్‌లోని మొరెనాకు బదిలీ అయ్యారు. అక్రమ గనుల తవ్వకాలను నిలువరించడంలో చురుగ్గా వుండేవారు. మైనింగ్ మాఫియా ఆగడాలను అడ్డుకోవడానికి నిరంతరం కృషి చేసేవారు. అయితే అదే మాఫియా తన ప్రాణాలు తీస్తుందని ఊహించాలేకపోయారు. మూడు పదుల వయసులోనే మాఫియా ఘాతుకానికి బలయ్యారు. అక్రమంగా గనులు తవ్వి తీసుకెళ్తున్న ఓ ట్రాక్టర్‌ను అడ్డుకునేందుకు విఫలయత్నం చేశారు. తను అడ్డంగా నిలబడితేనన్నా ఆగుతారని రోడ్డుకు అడ్డంగా నిల్చున్నా... వారు లెక్కచేయక నరేంద్రను గుద్దుకుంటూ వెళ్లిపోయారు. అలా మైనింగ్ మాఫియా రాక్షస కాండకు బలయ్యారు.

ఆయనంటే తీవ్రవాదులకు దడ



1968 బ్యాచికి చెందిన ఐపిఎస్ అధికారి అజిత్ డోవల్. మిజోరం, పంజాబ్, కాశ్మీర్‌లో తిరుగుబాటుదార్ల పీచమణచడంలో కీలకమైన పాత్ర పోషించారు. 1971 – 1999 మధ్య కాలంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన 15 విమానాలు హైజాక్ కాకుండా అడ్డుకోవడంలో చెప్పుకోదగిన కృషి చేశారు. అత్యంత ప్రమాదకరమైన పనిలో భాగంగా పాకిస్తాన్‌లో కూడా కొంతకాలం వున్నారు. అనంతరం ఇంటిలిజెన్స్ బ్యూరోలో చేరారు.

అక్రమార్కుల పాలిట కాళిక

అక్రమ కార్యకలాపాలను అడ్డుకోవడానికి కఠిన చర్యలు తీసుకోవడంలో బులంద్ షహర్ జిల్లా మెజిస్ట్రేట్ బి.చంద్రకళకు మంచి పేరుంది. అవినీతిలో కూరుకుపోయిన అధికారులను ఏమాత్రం చూస్తూ ఊరుకునేవారు కాదు. తప్పుడు పనులను సహించే మనస్తత్వం కాకపోవడంతో బదిలీలనేవి ఆమెకు సర్వసాధారణం. అంతేకాదు! సక్రమంగా విధి నిర్వహణ చేయలేని వారి గురించి బహిరంగంగానే మాట్లాడేవారు. ఆమె జోక్యం కారణంగానే ముగ్గురు అవినీతి కాంట్రాక్టర్లు అడ్డంగా దొరికిపోయారు. వారిలో ఒకరు ఉత్తర్‌ప్రదేశ్‌లో అధికార సమాజ్‌వాది పార్టీకి చెందిన బంధువు.

అవినీతిపరుల అంతు చూసేవారు

వృత్తి పట్ల అంకిత భావం, నీతి నిజాయితీలు కలిగిన అధికారి సత్యేంద్ర దుబే. ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్ అధికారి. జార్ఖండ్‌లోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎన్‌హెచ్ఎఐ)లో ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా చేశారు. తీవ్రమైన ఆర్థిక అక్రమాలను ఎత్తిచూపడంలో గొప్ప ధైర్య సాహసాలను ప్రదర్శించారు. పరిశ్రమలో అనేక అవినీతి చర్యలను బైటపెట్టారు. నాణ్యతలేని రోడ్లను తిరిగి నిర్మించేలా చేశారు. ఓ భారీ ప్రాజెక్టులో జరిగిన అవినీతిని, ఆర్థిక అవకతవకలు... పాత్రధారులుగా వున్న పెద్దల పేర్లను ... తెలియచేస్తూ అప్పటి ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయికి ఒక లేఖ రాశారాయన. అయితే తన పేరును గోప్యంగా వుంచమని కోరినా...అది బయటికి రావడంతో ఘోరం జరిగిపోయింది. ఉత్తరం రాసిన కొద్ది మాసాలకే బీహార్‌లోని గయలో దుండగుల తుపాకీలకు బలయ్యారు.

అట్టమీద కథ

ఇక్కడ అవయవాలు మార్చబడును

మానవ నిర్మాణంలో ప్రతి అవయవమూ విశిష్టమైనదే. ప్రతి అవయవమూ పునఃసృష్టి చేయలేనిదే. వయసు రీత్యా అవయవాలు పటుత్వం తగ్గి మరణించడం కాకుండా ఆధునిక జీవన విధానంతో ఆకస్మిక అకాల మరణాలు పెరిగాయి. రకరకాల వ్యాధులు, ప్రమాదాలు చిన్న వయసు వారినే పొట్టన పెట్టుకుంటున్నాయి. వారితోపాటు అపూర్వమైన అసమానమైన సంక్లిష్ట అవయవాలు కూడా మట్టిలో కలిసిపోతున్నాయి. అగ్గిలో బుగ్గయిపోతున్నాయి. అలాంటి వారి శరీర భాగాలను... పలు అవయవాలకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్న వారికి అమర్చగలిగితే! ఆ విశేషాలేంటో ఈ వారం అట్టమీది కథలో తెలుసుకుందాం.

-డా॥ కాకర్లమూడి విజయ్

బహుశా ఈ ఆలోచన నుండే అవయవ మార్పిడి వచ్చిందనుకుంటా. ఒకరి నుండి మరొకరికి అవయవాలు అంటుకట్టడం మానవుని శాస్త్రీయ పరిజ్ఞానానికి, నైపుణ్యానికి పెద్ద సవాలు ఆ సవాలుని మానవుడు ఎదుర్కొని విజయం సాధించాడు కూడా.

ఐదారు శతాబ్దాల క్రితం ప్రారంభమైన 'అవయవాల అంటుకట్టు ప్రక్రియ' ఈ మధ్య కాలంలో అవగాహన, సాంకేతికత పెరిగి ఊపందుకుంది. ఎందరో అభాగ్యుల పాలిట వరమైంది కూడా.

శాస్త్రీయపరంగా, అవయవ మార్పిడి అంత సులువైన పనేం కాదు. మానవ నైపుణ్యం పక్కన బెడితే అసలు శరీర తత్వమే నిజమైన ప్రతిబంధకం అవుతుంది. మనలో ఉండే సహజ వ్యాధి నిరోధకత పర శరీర భాగాలను సులువుగా అంగీకరించవు. బలవంతంగా ఒకవేళ అమర్చినా, కొత్తవాటిని వ్యాధి నిరోధక శక్తి వ్యతిరేకిస్తుంది, తిరస్కరిస్తుంది. ఇక్కడ తిరస్కరించడం అంటే ప్రాణ హాని అన్నమాటే! అంతటి తీవ్ర ప్రతికూల పరిస్థితుల మధ్య కూడా అవయవాల అంటుకట్టు ప్రక్రియ విజయవంతం అవ్వడం మానవేతిహాసంలో గొప్ప అధ్యాయం. మన దేశంలో అవయవాల మార్పిడి ఇంకా ప్రాచుర్యంలోకి రాలేదు. అందుకు కారణం మన దగ్గర నైపుణ్యం, నిపుణులు, వసతులు, సౌకర్యాలు లేక కాదు. అవయవాలు ఇచ్చే దాతలు, తీసుకోగలిగే గ్రహీతలు (వైద్యం కొరకు అయ్యే ఖర్చు భరించడం. శరీరం అనుకూలించడం) – ఈ రెండు అంశాలూ చాలా కీలకం. అమెరికా వంటి దేశాలలో అవయవ దాతల కోసం వేలాది పేషెంట్లు ఎదురు చూస్తుంటారు.

కొంతమంది తమకు తామే అవయవాలను దానం ఇవ్వడానికి ముందుకు వస్తారు – తమ తరువాత తమ అవయవాలు మరొకరికి – లేదా మరి కొంతమందికి –ప్రాణదానం చేయడానికి. అయితే ఎటువంటి అవయవాలు మార్పిడి జరగాలో అనే అంశంలో భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. అత్యంత ఆవశ్యకమైన అవయావాలు – గుండె, కిడ్నీలు, కాలేయం వంటివి – మాత్రమే పరిగణించాలన్న వాదన బలంగా ఉంది. ఇటివల వార్తల్లోకి వచ్చిన పురుషాంగ మార్పిడి నేపథ్యంలో ఈ వాదన మరింత బలాన్ని పుంజుకుంది. ఆఫ్రికా తెగల్లో సున్తీ చేయించుకోవడం పరిపాటి. మరీ మొరటు పద్ధతులు అవలంభించడం వల్ల పురుషాంగం దెబ్బ తినడం కూడా పరిపాటే. అటువంటి స్థితిలో ఒక యువకుడికి గత డిసెంబరులో జరిపిన మార్పిడి విజయవంతం అయ్యింది. ఈ మార్పిడి ప్రాణాల్ని నిలిపేది కాకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. కానీ, దెబ్బతిన్న పురుషాంగం కారణంగా యువకులు ఆత్మహత్యల వైపు మళ్లుతున్నారనీ, ఆ కారణాంగా ఇటువంటి సర్జరీలు ఆవశ్యకమే అనేవాళ్లూ ఉన్నారు.

అలాగే గుండె, చెవులూ, చేతులూ, కాళ్లూ, వేళ్లూ, గర్భాశయాలూ, స్త్రీ జననాంగాలూ కూడా అవయవ మార్పిడి జాబితాలో ఉన్నాయి.

వీటన్నిటికంటే సంక్లిష్టమైన మార్పిళ్లు మెదడు, తల, ముఖం. ముఖం మార్పిడి ఓ మోస్తరుగా జరిగినా... మెదడు, తల మొత్తం మార్పిడి ప్రక్రియ త్వరలో విజయం సాధించవచ్చు. ఇక గుండె, కాలేయం, రక్తం, కళ్లు, చర్మం, ఎముకలు, కిడ్నీలు, వంటి అవయవాల మార్పిడి ఇప్పుడు సాధారణం అయిపోయింది. కొన్ని సందర్భాలలో స్వంత శరీరభాగమే మార్పిడికి పనికివస్తుంది. బట్టతలకి స్వంత తల వెంట్రుకలు, కాలిన చర్మానికి స్వంత చర్మం ఇలాగే అమరుస్తారు. కొన్ని సందర్భాలలో మాత్రం ఇతరుల నుండి అవయవాలు రావలసిందే. జతగా ఉండే అవయవాలు (కిడ్నీల వంటిది) జీవించి ఉన్న దాతల నుండే గ్రహించవచ్చు జతగా ఉండని అవయవాలు మాత్రం మరొక విగతజీవి నుండే రావాలి.

ఈ అవయవ మార్పిడి క్రమంలో

మరో వివాదాస్పద అంశం మానవేతర జీవుల నుండి అవయవాలను గ్రహించవచ్చా అన్నది. తొలి రోజుల్లో పంది గుండె తీసి మనిషికి అమర్చిన వైనాలు ఉన్నాయి. పదిహేడవ శతాబ్దంలోనే కుక్క పుర్రె ఎముకను మనిషికి అమర్చారు. మానవేతర జీవుల నుండి మానవులకు అవయవ మార్పిడి చేయడం నైతికంగా సమంజసం కాదు అనే వాళ్లున్నారు. మనిషి జీవితాన్ని కొనసాగించడానికి అవయవాలు ఇక్కడి నుండి వస్తే ఏమిటనే వారూ ఉన్నారు. సామాజికంగా ఇతర జీవుల నుండి తీసుకోవడం ఎంత ఆక్షేపణీయమో, మృతుల భాగాలు తీసుకోవడం అంతే ఆక్షేపణీయం అన్న అభిప్రాయమూ ఉంది. కానీ శాస్త్రీయాభివృద్ధి క్రమంలో రెండూ చెప్పుకొదగ్గ మలుపులే.

మరొకవైపు అసలీ కళేబరాల ప్రసక్తి లేకుండా మూలకణాల (stemcells)ను ఉపయోగించి, కావలసిన అవయవాన్ని సృష్టించే.. వాడే దిశగా ప్రయత్నాలు చాలావరకూ విజయం సాధించాయి. ఇంకొకపక్క ప్రయోగశాలలో కృత్రిమంగా కణజాలాలూ, శరీరభాగాలూ తయారు చేసి వాడటం కూడా జరుగుతోంది. ఇవన్నీ మానవ మేధకు అద్దంపట్టేవే అయినా, అసలు అవయవ మార్పిడి జరిగిన (అవయవాల్ని స్వీకరించిన) వారు దీర్ఘకాలం జీవించిన దాఖలాలు తక్కువ. అంత ఖర్చు, కష్టాలు భరించి అవయవాలు మార్పించుకున్నా ఆ క్షణంలో ప్రాణం నిలిచినా, జీవన నాణ్యత మాత్ర ఉండదన్నది కొందరి మాట! కొత్త అవయవాలతో ఇబ్బందులూ, జాగ్రత్తలూ, ముందులూ.. ఇవన్నీ కలిసి అంత ఆనందమయమైన జీవితం ఇవ్వడం లేదు అన్నదాంట్లో వాస్తవం లేకపోలేదు. ఎంతైనా రిపేరు చేయబడ్డ యంత్రానికి పూర్వపు పనితనం ఉండకపోవచ్చు.

రాబోయే కాలంలో అధునిక ఫ్రాంకెన్‌స్టయిన్‌లు (పలురకాల శరీర భాగాలను కలిపి ఒక మనిషిని కుట్టిన శాస్త్రవేత్త జీవితం ఆధారంగా వచ్చిన హాలీవుడ్ సినిమా) అధికం కావచ్చు అంట్లు కట్టి కొత్త మొక్కల్ని కృత్రిమ సంపర్కాలతో కొత్త కుక్కల్నీ రూపొందించిన మానవుడు 'పాత అవయవాలు మారుస్తాం' అంటూ 'మరో' మానవుణ్ణి సృష్టించే రోజు దగ్గర్లోనే ఉన్నట్టుంది. తలపై వెంట్రుకల నుండి, కాలి గోళ్ల వరకూ, కంటి నుండి జననాంగం వరకూ దాదాపు అన్ని భాగాలను అవసరార్థం మార్చుకునే రోజులు రానున్నాయి. అయితే ఇదంతా వ్యాపారంగా మార్చే వ్యక్తులూ, అందుకు సహకరించే చీకటి మనుషులూ కూడా రావచ్చేమో అన్న ఆందోళన కూడా వెలిబుచ్చేవారున్నారు.

బ్రెయిన్ డెత్

సాధారణంగా మరణం అనగానే మనం గుండె ఆగిపోవడం అనుకుంటాం. గుండె కొట్టుకోవడం ఆగడం అంటే రక్త ప్రసరణ ఆగినట్టు, అంటే శరీరానికి అవసరమైన ప్రాణవాయువు కణాలవరకు వెళ్లకపోవడం. పర్యవసానంగా శరీర ప్రక్రియలు ఆగిపోతాయి – అదే మనం మరణం అంటాం.

ప్రాణాన్ని నిలిపే రక్త ప్రసరణ శ్వాస ఆగితే, 'కార్డియో పల్మనరీ ఆరెస్ట్' అంటారు. ఈదశనే 'క్లినికల్ డెత్' అంటారు. అంటే మనిషి చనిపోయినట్టే లెక్క – కానీ, సమయస్ఫూర్తి, జ్ఞానం గల వైద్యులు వెంటనే స్పందించ గలిగితే, ఆగిపోయిన గుండెనీ, శ్వాసనీ కొన్ని వైద్య ప్రక్రియల ద్వారా మళ్లీ పని చేసేటట్టు చేయవచ్చు. అంటే పునర్జన్మే!

ఆక్సిజన్ అందకపోతే మిగతా అవయవాలకన్నా

తొలి గుండె మార్పిడి

దక్షిణాఫ్రికా, డిసెంబర్ 3, 1967.

కేప్‌టౌన్‌లోని గ్రూట్ స్కూర్ ఆసుపత్రిలో 53 ఏళ్ల లివిస్ వాష్‌కాన్‌స్కీ దీర్ఘ కాల హృద్రోగంతో బాధపడుతున్నాడు. అతను బతకాలంటే దెబ్బతిన్న గుండె బదులు మంచి గుండె అవసరం. అంతవరకు అలాంటి ఆలోచనే విచిత్రం. దాదాపు పదేళ్ల క్రితం కాలిఫోర్నియాలో నార్మన్ షన్వే అనే వైద్యుడు శునకానికి గుండె మార్పిడి చేయడంలో విజయం సాధించి వున్నాడు. కానీ ప్రస్తుతం మనిషికి అవసరం. అప్పుడే డెనిస్ దార్వాల్ అనే 28 ఏళ్ల యువతి రోడ్డు ప్రమాదానికి గురై చనిపోయింది. వాష్‌కాన్‌స్కీని చూస్తున్న బర్నార్డ్ అనే సర్జన్‌కి ఆశ చిగురించింది. వెంటనే డెనిస్ గుండెను తీసి వాష్‌కాన్‌స్కీకి అమర్చాడు. వైద్య రంగంలో విప్లవం. అద్భుతం. అదే మొట్టమొదటి మానవ హృదయ మార్పిడి శస్త్ర చికిత్స. ఆ ప్రక్రియ విజయవంతమైంది. కానీ వాష్‌కాన్‌స్కీ శరీర రోగ నిరోధక వ్యవస్థ కొత్త గుండెను అంగీకరించలేదు. ఎన్నో మందులు వాడారు. కొత్త గుండె అమర్చిన పద్దెనిమిది రోజులకు న్యుమోనియా కారణంగా మరణించాడు. విచిత్రమేమిటంటే అతను చనిపోయే వరకూ కొత్తగుండె బ్రహ్మాండంగా పనిచేస్తూనే వుంది. డెబ్బయ్యవ దశక ప్రారంభానికి మరింత మెరుగైన మందులు అందుబాటులోకి వచ్చాయి. శరీరాలు కొత్త అవయవాలను అంగీకరించడం మొదలెట్టాయి. దరిమిలా బర్నార్డ్ చేసిన గుండె మార్పిళ్లు ఎంతో మందికి కొత్త జీవితాన్నిచ్చాయి. ఈనాటికీ గుండె మార్పిళ్లు జరుగుతున్నాయి. కానీ దాతలే కరువయ్యారు.



ముందుగా మెదడు దెబ్బతింటుంది. గుండె కొట్టుకోవడం ఆగిన నాలుగైదు నిముషాల వరకూ మెదడు 'సజీవంగానే' ఉండే అవకాశం ఉంది. అంటే క్లినికల్ డెత్ తరువాత కూడా మెదడు జీవించే ఉంటుంది. ఆ నాలుగైదు నిముషాల తరువాత క్రమేపీ నాడీకణాలు చనిపోవడం ప్రారంభిస్తాయి. ఇక వాటిని పూర్వపు స్థాయికి ఏవిధంగానూ తీసుకురావడం కుదరదు. ఈ దశనే 'బ్రెయిన్ డెత్' అంటారు. అప్పుడు వైద్యులు 'చట్టపరంగా' మరణించాడు అని చెబుతారు.

వైద్య దేవుళ్లు

ఒక వ్యక్తి క్లినికల్‌గా మరణించినా, కృత్రిమ పద్ధతుల ద్వారా అతని ప్రాణాన్ని నిలపవచ్చు. బ్రెయిన్ డెత్ అయిన వ్యక్తి తాలూకు కొన్ని ముఖ్య అవయవాలు కొంతసేపు సజీవంగా ఉండే అవకాశం ఉంది. ఆ కొద్ది, ముఖ్య సమయంలోనే గుండె, కాలేయం, మూత్రపిండాలు వంటి అవయవాలను ట్రాన్స్‌ప్లాంట్ కోసం తీసుకోవచ్చు. అలా సేకరించిన అవయవాలను కొన్ని ప్రత్యేక ద్రవాలలో (కణాలు చనిపోకుండా) ఉంచి కొన్ని గంటలపాటు సజీవంగా ఉంచవచ్చు. ఆ కొద్ది సమయంలో ఆ అవయవాలను గ్రహీత శరీరంలో అమర్చవలసి ఉంటుంది.

గ్రహీతని అవయవ మార్పిడికి సిద్ధం చేయడం, వచ్చిన అవయవాన్ని అతి జాగ్రత్తగా నాడులు, రక్త, నాళాలతో సహా జోడించడం. తిరిగి కొత్త అవయవాన్ని శరీరంలో పనిచేయించడం... ఇదంతా ఒక అద్భుతక్రియ. మానవ మేధస్సుకు, వైద్యుల వేళ్ల పనితనానికి, నైపుణ్యానికి పరాకాష్ట. అక్కడ దాత కుటుంబానికి ఒక ప్రాణం నిలిపామన్న తృప్తి ఉంటుంది. ఒక్కడ గ్రహీతకు ప్రాణం కొనసాగుతుందన్న ఆనందం ఉంటుంది. ఈ అద్భుతాన్ని చేసి చూపించిన వైద్య బృందానికి మాత్రం ఇదో 'పని' లాగే ఉంటుంది. ఇటువంటి మరో అద్భుతాన్ని చూపించే అవకాశం కొరకు ఎదురు చూస్తుంటారు వాళ్లు వైద్య దేవుళ్లు.

ఎవరు అవయవ దానం చేయొచ్చు?

అవయవ దాతలు జీవించి ఉన్నవారూ కావచ్చు.



మృతులూ కావచ్చు. ఒకవేళ మృతుడైతే గుండె కొట్టుకోవడం ఆగిన 24 గంటల లోపల కణజాలాలను (టిష్యూలను) తీసుకోవచ్చు. ఇక్కడ టిష్యూలంటే
కార్నియా (కంటి ముందు భాగం), చర్మం, పాంక్రియాస్, ఎముకలోని మజ్జ (బోన్‌మారో), రక్తం, గుండె కవాటాలు (వాల్వులు), ఎముకలు. ఈ టిష్యూలని (కార్నియా తప్ప) సుమారు 9 సంవత్సరాల వరకు నిల్వ చేయవచ్చు కూడా. ఈ కారణంగా అమెరికాలో ఏటా సుమారు పది లక్షల టిష్యూ మార్పిడులు జరుగుతాయని అంచనా. జీవించి ఉన్న దాతలు తమలోని పునరుత్పత్తి కాగల కణజాలాన్ని (రక్తం, చర్మం) లేదా ఒక కిడ్నీని, కాలేయంలో కొంత భాగాన్ని ఒక ఊపిరితిత్తిని దానం చేయవచ్చు.

ఇక మరణించిన వారి నుండి దాదాపు ప్రతి అవయవమూ గ్రహించవచ్చు.

అవయవ సేకరణకు కొన్ని సంస్థలు ఉన్నాయి. అవి గ్రహీతల అవసరాన్ని బట్టి దాతలను గుర్తించడం, మార్పిడిలో సహకరించడం చేస్తాయి.

మూడేళ్ల క్రితం అమెరికాలో ఒక చారిత్రాత్మక ఘట్టం జరిగింది. కాలిఫోర్నియాలో ఒక వ్యక్తి ఒక అపరిచితుడికి తన కిడ్నీ దానం చేశాడు. అందుకు ప్రతిగా, గ్రహీత కోడలు మరొకరికి తన కిడ్నీ దానం చేసింది. ఇలా, 4 నెలల్లో, 17 ఆసుపత్రులలో, 11 రాష్ట్రాలలో 30 మందికి కిడ్నీలు అమర్చబడ్డాయి.

అధిక డిమాండు

ప్రపంచ వ్యాప్తంగా అవయవాలకు డిమాండు పెరుగుతోంది. కానీ డిమాండుకు తగ్గ సప్లై లేదు. యుకెలో దాదాపు 900 మందికి దాతలు ఉంటే 6000 కుపైగా గ్రహీతలు వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. అమెరికాలో సుమారు 70000 మంది వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు.

ఈ వ్యత్యాసానికి కారణం అవగాహనా లేమి. నేత్రదానాలకు చాలా మంది సుముఖత

అవయవాల కొరత

మన దేశ సైన్సు టెక్నాలజీ మంత్రి రెండేళ్ల క్రితం మరణించినప్పుడు కాలేయం కనక మార్పిడికి లభించి వుంటే ఆయన జీవించి వుండేవాడని వైద్యులు చెప్పారు. మన దేశంలో ఏటా రెండు లక్షల మందికి మూత్ర పిండమూ, లక్ష మందికి కాలేయమూ అవసరమౌతున్నాయి. కానీ రెండు శాతం మాత్రమే సర్దుబాటు చేయగలుగుతున్నాం.

నలుగురికీ ఉపయోగపడు

న్యూయార్క్ యూనివర్సిటీలో పిహెచ్‌డి పూర్తి చేస్తున్న 29 ఏళ్ల స్టిఫనోస్ బైక్ ఒక కారుని ఢీకొట్టడంతో మరణించాడు. తలకు హెల్మెట్ లేకపోవడం అందుకు కారణం. ఈ వార్త తెలిసిన అతని తల్లి ఎలినీ గ్రీసు నుంచి న్యూయార్క్‌కు హుటాహుటిన ఇచ్చింది. కానీ చేయగలిగిందేమీ లేదు. తనకు కలిగిన లోటును ఎవరూ పూరించలేకపోయినా...ఇతరుల లోటును పూరించగలననుకున్న ఆమె తన ఒక్కగానొక్క కుమారుడి అవయవాల దానానికి పూనుకుంది. పదకొండేళ్లుగా కిడ్నీ కోసం ఎదురుచూస్తున్న ఆనా బజానాకి కిడ్నీ, పాంక్రియాస్ అమర్చారు. యాభై ఏళ్ల జేమ్స్ కూపర్‌కి గుండె లభించింది. కాలేయ క్యాన్సర్‌తో బాధపడుతున్న 58 ఏళ్ల వేలరీ కూపర్‌కి కాలేయం లభించింది. స్టఫనోస్ మరో కిడ్నీని ఏడేళ్ల బాలుడికి అమర్చారు.

చూపుతున్నా ఇతర అవయవాల దానానికి సరైన అవగాహన చాలా మందికి లేదు. పైగా 'బ్రెయిన్ డెత్' అనే విషయం ఇటీవలే ప్రజలలోకి వచ్చింది. అందుకు తోడు ఎవరు ఎవరిని సంప్రదించాలి, ఇందులో డబ్బు లావాదేవీలు, ఖర్చులు వగైరా వివరాలు సరిగా తెలియవు.

అవసరం

మన దేశంలో అవయవ దాన చట్టం 1994లో చేయబడింది. ఆ తరువాత సుమారు 900 దాతల నుండి అవయవాల నుండి తీసుకున్నారు.

అవసరమైన అవయవం లభించక రోజూ 30–50 మంది చనిపోతున్నారు మన దేశంలో అవయవ దాతలు పది లక్షలకు 0.05 మంది. అదే స్పెయిన్‌లో 42, అమెరికాలో 25, యూకెలో 30 మంది ఉన్నారు. ప్రతి రోజూ దాదాపు 250 మంది రోడ్డు ప్రమాదాల్లో మరణిస్తున్నారు. వారిని బ్రెయిన్ డెత్ గా ప్రకటిస్తే 40 శాతం వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న పేషెంట్లకు ప్రాణం దక్కవచ్చు.

అవయవాల మార్పిడి చట్టం

ట్రాన్స్‌ప్లాంటేషన్ ఆఫ్ హ్యూమన్ ఆర్గాన్స్ చట్టాన్ని ప్రభుత్వం 1994లో తెచ్చింది. దీని ప్రకారం అవయవాల అమ్మకాలు నిషేధించబడ్డాయి. డాక్టర్లు 'బ్రెయిన్ డెత్' గా నిర్ధారించిన వారి నుండే, వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో



మాత్రమే అవయవాలు సేకరించాలి.

అవయవ మార్పిడి సర్జరీలు చేయడానికి అందరికీ, అధికారం లేదు. నైపుణ్యం కలిగిన వైద్యులు, ఆ వసతుల గల ఆసుపత్రులు 'జీవన్ దాన్' కార్యక్రమంలో నమోదు అయి ఉండాలి. మన రాష్ట్రంలో ఇప్పటి వరకూ 20కి పైగా ఆసుపత్రులు అవయవ మార్పిడికి నమోదై ఉన్నాయి. నమోదు కాని వాటిలో అవయవ మార్పిడి శస్త్ర చికిత్సలు చేయడం చట్టరీత్యా నేరం. ✦

గుండెలు మార్చిన మొనగాడు

మన దేశంలో జరిగిన మొట్టమొదటి గుండె మార్పిడి చికిత్స ఢిల్లీలో జరిగింది. ఆ చికిత్స చేసిన వైద్య బృందానికి నేతృత్వం వహించింది రాజమండ్రిలో జన్మించిన డా॥పానంగిపల్లి వేణుగోపాల్. భారత పార్లమెంటు మే 1994లో అవయవ మార్పిడి బిల్లును ఆమోదించింది. అదే సంవత్సరం ఆగస్టు మూడున డా॥వేణుగోపాల్ మన దేశంలో తొలి గుండె మార్పిడి చేశారు. ఆ తర్వాత ఆయన సుమారు పాతిక గుండెలను మార్చారు. ఆ సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్ పురస్కారంతో సత్కరించింది.

గుండె మార్పిడి ఇలా...

ఈ మధ్య హైదరాబాద్‌లోని యశోదా ఆస్పత్రి వైద్యులు ఇద్దరు మహిళలకు చేసిన హృదయ మార్పిడి సామాన్యుల్లో సైతం ఆసక్తిని రేకెత్తించింది. శరీరం మొత్తంలోకి కీలకమైన గుండె మార్పిడి దశలేంటో చూద్దాం.

- ❑ బ్రెయిన్ డెత్ అయిన వ్యక్తి రక్తపోటు ఎలా వుంది? ఇతర జబ్బులేవైనా వున్నాయా? ఇన్‌ఫెక్షన్ ఏదైనా వుందా? ఏ మందులు వాడుతున్నారు? ఎకో టెస్ట్ చేసి గుండె మార్పిడికి తగినదా కాదా? అనే విషయాలు తెలుసుకుంటారు.
- ❑ అన్నీ అనుకూలంగా వుంటే గుండె మార్పిడి చేయవచ్చు.
- ❑ అక్కడ వైద్య బృందం గుండెను తీసుకొని బయల్దేరింది మొదలు ఇక్కడ స్వీకర్తకు అమర్చే ఆస్పత్రిలో వైద్య బృందం నిరంతరాయంగా ఎప్పటికప్పుడు మాట్లాడుతూనే వుంటారు.
- ❑ అనస్తీషియా ఇచ్చి ఆపరేషన్‌కి సిద్ధం చేస్తారు.
- ❑ గుండెను తీసుకొని ఆస్పత్రికి దగ్గరయ్యే కొద్దీ సర్జరీ మొదలుపెట్టి ఛాతీ తెరిచి హార్ట్ లంగ్ మెషీన్‌తో రోగికి అనుసంధానం చేస్తారు. ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా గుండె తొలగించడానికి చేసే ఏర్పాటే ఇది.
- ❑ చివరికి కొత్త గుండె ఆస్పత్రికి చేరుకోగానే మరోసారి గుండెను పరీక్షించి పాత గుండె స్థానంలో కొత్త గుండెను అమర్చుతారు.
- ❑ గుండె మార్పిడి శస్త్ర చికిత్సకు పట్టే సమయం ఐదారు గంటలే అయినా ప్రక్రియ మొత్తం పూర్తవడానికి 15 నుంచి 20 గంటల సమయం పడుతుంది. మొత్తంగా ఒక్క క్షణం కూడా ఏమరపాటు లేకుండా ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించుకుంటూ వైద్య బృందాలు ఆపరేషన్ చేస్తాయి.
- ❑ ఆ తర్వాత స్వీకరించిన కొత్త గుండెను శరీరం తిరస్కరించకుండా ఇమ్యునో సప్రెసెంట్స్ అనే మందులను వెంటనే మొదలుపెట్టాలి. వీటిని రోగి జీవితాంతం వాడాల్సిందే.

యశోద హాస్పిటల్‌లో ఇటీవల గుండె మార్పిడి చేసుకున్న రాణి, పద్మ

ప్రేమ... విప్లవం...

మార్క్స్, జెన్నీ ప్రేమ కథ-29

◆ సీరియల్



“ విప్లవ మిత్రులకు ఆర్థిక సహాయం చేస్తున్నాననే అభిప్రాయంతో ఎంగెల్స్ తన పెట్టుబడిదారీ జీవిత విధానాన్ని సమర్థించుకొని వుంటాడు. టెక్స్‌టైల్ మిల్లులో పని చేస్తున్నప్పుడు, అప్పుడప్పుడు క్యాష్ బాక్స్‌లోని డబ్బును కూడా వాడుకొని, ఒకవైపు మార్క్స్ కుటుంబానికి సాయం చేస్తూ. మరోవైపు మాంచెస్టర్‌లో బర్న్స్‌లను పోషించాడు:పైకి, ఎవరికీ అనుమానం రాకుండా ఫాక్టరీ యజమాని కొడుకు పాత్ర బాగానే పోషించాడు. సంపన్నులలాగే వాళ్ల క్లబ్బులకు వెళ్లినా, వాళ్లతో కలసి తిరిగినా, అతని నిజమైన స్నేహితులు, కామ్రేడ్లు, కార్మికులు, తిరుగుబాటుదార్లు, పోలీ సుల కళ్లు గప్పి తిరుగుతున్న వుద్యమ కారులు. జెన్నీ అతణ్ణి తరచూ ‘గ్రేట్ కాటన్ లార్డ్’ అంటూ టీజ్ చేసింది. అతడు నిజంగా అంత సంపన్నుడే. కాని అది విప్లవకారుని హృదయం. ”

రోమ్ నగరంలోని సెయింట్ పీటర్స్ బాసిలికా కన్న పెద్దదైన క్రిస్టల్ పాలెస్‌లో నిర్వహించారీ ఎక్స్‌పోను. ఫూకో (foucan 14) పెండ్యులం నుండి ఫ్లష్ టాయిలెట్ దాక లక్ష అద్భుతాలను జనం తిలకించవచ్చు. నేటి షాపింగ్ మాల్స్‌కు ప్రాగ్రూపమిది. అనేక అంతస్తులలో వున్న షాపులలో తమంత తామే కదిలిపోతున్న వస్తువులు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అలెలూయా అనబడే భక్తి సంగీత కార్యక్రమం అందర్నీ ముగ్ధుల్ని చేసింది. ‘నా మనసు ఆరాధానా భావంలో నిండిపోయింది. ఐతే నేను హాజరైన అతి గొప్ప క్వాయిర్” అంది ఆ మహారాణి. చర్చ్ ఆఫ్ ఇంగ్లండ్ అధిపతి ‘పరిశ్రమ’ను కొత్త మతంగా ప్రకటించాడు. బ్రిటన్‌కు సంబంధించినంత వరకు పెట్టుబడి దారీ వ్యవస్థ స్వర్ణయుగం ప్రారంభమైంది. (పండితులు, అప్పటికి వాడుకలో వున్న ‘ఇంపీరియలిజం’ . బదులుగా కొత్త వ్యవస్థను ‘ కాపిటలిజం’ అన్నారు.)

నిజానికి ఒక్క బ్రిటన్‌లోనే కాదు. యూరోప్ అంతటా పెట్టుబడి రాజ్యమేలింది. ‘king capital’ అని వ్యంగ్యంగా సంబోధించారు. 1849 తర్వాత కొద్ది కాలానికే ఆర్థిక అభివృద్ధి గణనీయంగా పెరిగింది – తిరుగుబాట్లను అణిచివేసి రియాక్షనరీ శక్తులు అధికారంలోకి వచ్చాక జరిగిందిది. మార్క్స్ చెప్పింది నిజమేనని వాళ్లూ గ్రహించారు. నిరుద్యోగం, ఆకలి, దారిద్ర్యం, అనారోగ్యం లాంటివి భావజాలం కన్నా శత్రుసైన్యాల దాడులకన్నా ప్రమాదకరమైనవి. సమాజానికి పునాదిలాంటి అట్టడుగు వర్గాలు తిరుగుబాటు చేస్తే సమాజమనే భవనం పేకమేడలా కూలిపోతుంది. ఈ ప్రమాదాన్ని నివారించటానికి రైల్వేలు, గృహ నిర్మాణం, ఫ్యాక్టరీలు ఒకటేమిటి అన్ని రంగాలలోనూ పుష్కలంగా వుద్యోగావకాశాలు కల్పించారు. ఈ నిర్ణయం వల్ల, సహజంగానే పెట్టుబడిదార్లకు లాభాలు కూడా పెరుగుతాయి. 1851లో కేవలం, ఒక్క లండన్ నగరంలోనే భవన నిర్మాణాలలో ఆరవై ఆరు వేలమంది ఉపాధి పొందారు. ఇదే అక్కడి అతి పెద్ద పరిశ్రమ. అయితే, ఈ నిర్మాణాలు చేపట్టించి పేదలకు మెరుగైన గృహ వసతి కోసం కాదు. బెల్‌గ్రావియం, కెన్సింటన్ వంటి కొత్తగా వెలసిన బస్తీలలో సంపన్నులుగా మారిన మధ్య తరగతి వాళ్ల కోసం ఖరీదైన విల్లాలు కట్టారు.

ఈ పరిశ్రమల స్వర్ణయుగం వెనక, యూరోపియన్ ప్రభువులూ, వాళ్ల చేతిలో కీలు బొమ్మలుగా మారిన పార్లమెంట్ల సహాయ సహకారాలు దండిగా వున్నాయి. ఎందుకంటే పార్లమెంట్లులో వున్నదంతా వ్యాపారస్తులూ, పారిశ్రామికవేత్తలే. ఈ సంస్థల, పరిశ్రమల యజమానులు వాళ్లే. ఈ ఛోటా మోటా పెట్టుబడిదార్లు తమ వ్యాపారాభివృద్ధి కోసం సృష్టించుకుందే స్టార్ మార్కెట్, వ్యాపారాలు లాభసాటిగా మారాలంటే పెట్టుబడులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో వుండక తప్పదని అందరూ అంగీకరించారు. ఆ తర్వాత తమ మధ్య పోటీ పెరగాలి. ఏదైనా సరే. తక్కువ ధరకు కొని ఎక్కువ ధరకు అమ్మాలి. ఇది స్వేచ్ఛా పంపిణీలో మాత్రమే సాధ్యం. ఈ వ్యాపార సూత్రానికే మరో పేరు కాపిటలిజం.

రైల్వేలు, స్టీమ్ షిప్పులు, టెలిగ్రాఫ్‌తో వ్యాపారం యిబ్బడి ముబ్బడిగా పెరిగింది. ఈ

మూలం : మేరీ గేబ్రియెల్ ‘లవ్ అండ్ కేపిటల్’

స్వేచ్ఛానువాదం: **ముక్తవరం పార్థసారథి**

కొత్త ఆవిష్కరణలతో కాలం, దూరం గణనీయంగా తగ్గాయి. అయితే, పారిశ్రామిక ఉత్పత్తుల కన్నా వ్యాపారంలో రిస్కు తీసుకోవటానికి ప్రేరణ యిచ్చింది బంగారం. కాలిఫోర్నియాలో బంగారు నిల్వలు బయటపడడంతో, ప్రాణాలకు తెగించి, పెట్టుబడులు పెట్టే ఆ పచ్చలోహాన్ని వెంట తెచ్చుకో గలిగినవాళ్లు కోట్లు ఆర్జించారు (అప్పటికి అమెరికన్ సరిహద్దుల్లో ఆ వ్యాపారం మీద ఏ ఆంక్షలూ లేవు.). అమెరికన్లతో పోల్చితే

యూరోపియన్ ఖజానాలు ఖాళీగా కనిపించాయి. నియమాలెంత ఎక్కువగా వుంటాయో లాభాలంత తక్కువగా వుంటాయి. స్వేచ్ఛా విపణిలో లాభాలకు ఆకాశమే హద్దు. వెంటనే ఖనిజ తవ్వకాల మీద అంక్షలు తొలగించారు. వ్యాపార నియమాల్ని సరళీకరించారు. వ్యాపారాభివృద్ధే లక్ష్యంగా కొత్త చట్టాలు చేశారు.

లండన్ ప్రదర్శనలో ఈ నూతన వాణిజ్య సూర్యోదయం ప్రతిఫలించింది. ఇది ప్రజల్ని ఎంతగా ఆకర్షించిందంటే, ఎవరూ రాకుండా వుండలేక పోయారు. ఇతర దేశాల నుండి వస్తున్న ప్రభుత్వాధినేతల కోసం లండన్‌లోని ప్రాంతాలను ప్రత్యేకంగా అలంకరించారు. వీధులు ఎప్పటికప్పుడు శుభ్రం చేశారు. భవనాలకు రంగులు వేశారు. పొగచూరిన కిటికీల అద్దాలను రుద్ది తళతళ మెరిసేట్టు చేశారు షాపు యజమానులు. మరీ ముఖ్యంగా, ఇళ్లు లేని వందలాది మంది రాత్రిళ్లు హైడ్‌పార్క్‌లో పడుకుంటారు. వాళ్లందర్నీ దూరంగా తరిమేశారు. పేదలు నిర్మించిన లండన్ సింగారించుకొని సంపన్నులను ఆకర్షించటానికి సిద్ధమైంది.

ఇంగ్లీషు వాళ్లు తమకు దక్కిన ఈ అపూర్వ గౌరవానికి పొంగిపోయారు ప్రదర్శనతో ప్రపంచ దేశాలలో అగ్రగామిగా నిల్చింది తమ దేశం. 1851 నాటి ప్రపంచంలోని, రైల్వే లైన్లు, షిప్పుల్లో సగం బ్రిటన్‌వే.
శాస్త్ర సాంకేతిక అభివృద్ధి సంగతి ఎలా వున్నా 'ప్రైవేటు ఆస్తి' భావనకు ప్రపంచం సమర్పించిన నివాళి ఆ ప్రదర్శన. మార్క్స్‌కు కోపం తెప్పించిన విషయం కూడా యిదే. ఇన్నాళ్లు 'విప్లవకారుల' ప్రగల్భాలను, పగటి కలల'ను వినీవినీ విసుగెత్తింది. నేడో, రేపో విప్లవం తప్పదన్నారు. ఇక, పెట్టుబడిదార్ల పగటి కలల్ని భరించాలి కాబోలు. పారిశ్రామికవేత్తలకు రాయబారుల్లాంటి వారు వ్యాపారులు. తమ ఉత్పత్తుల్ని 'ప్రపంచం నలు మూలలకూ సరఫరా చేస్తారు. మార్క్స్ ఎంగెల్స్‌లకు ఈ ప్రదర్శన 'ప్రపంచాన్ని జయించాలనే బూర్జువా దురాశకు దర్పణం', 'స్వేచ్ఛా విపణి' భావనను ప్రచారం చెయ్యాలనుకుంటున్నారు. ఇక వ్యాపారం, దేశ సరిహద్దులకు పరిమితం కాదు. స్థానిక వుత్పత్తులకూ, సామాజిక సంబంధాలకూ విలువుండదు. ఇది మరో ఆర్థిక సంక్షోభానికి దారి తీస్తుంది. ఆ సంక్షోభం సంవత్సరం లోపే వస్తుందనుకున్నారు.

ఇన్నాళ్లూ, జెన్నీ, ఎంగెల్స్ ఎంత పోరినా, 'పొలిటికల్ ఎకానమీ' పుస్తకం మీద పని ప్రారంభించని మార్క్స్‌ను ఈ ప్రదర్శన ములుగర్రలా కదిలించింది. పారిశ్రామిక, సాంకేతిక ప్రగతిలో తప్పేమీ లేదు. చరిత్ర క్రమమలాగే వుంటుంది. ఎలక్ట్రిక్ ఇంజన్‌ను చూసి, ఆ అద్భుతానికి ఎంత సంతోషించాడంటే, 'ఆవిరి యంత్రంతో పోల్చితే యిది విప్లవమే. దీని పరిణామాలను వూహించటం కూడా కష్టమే' అన్నాడు. శాస్త్ర సాంకేతిక రంగాలలోని ఆవిష్కరణలన్నీ కొద్ది పెట్టుబడిదారుల కబంధ హస్తాలలోనే ఎందుకున్నాయి? వీటి వల్ల వచ్చిన మార్పులతో అత్యధిక జనం ఎందుకు లాభపడటం లేదు?' అన్నదే మార్క్స్ పరిశోధన.

1851 వసంత కాలంలో, 'కాపిటలిజం' అనే మాట యింకా ప్రచారంలోకి రాకముందే, ఆవిర్భవిస్తున్న ఈ కొత్త ఆర్థిక, రాజకీయ, సామాజిక వ్యవస్థ అధ్యయనానికి శ్రీకారం చుట్టాడన్న మార్క్స్ ప్రపంచ వ్యాప్తంగా, అన్ని దేశాలనూ, సమాజాలనూ యివి ఎలా పెనవేసుకుపోయాయన్నదీ, మానవ జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నదీ కూలంకషంగా తెలుసుకోవాలి. పదహారేళ్లపాటు నిరంతరం శ్రమించి, వేలాది పేజీల నోట్సు తీసుకుని రాసి, తన మాగ్నం ఓపస్ 'కాపిటల్' మొదటి భాగం ప్రచురించాడు. అతని అనుయాయులకు ఇందులో పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కనిపించింది. దాన్నే 'మార్క్సిజం' అన్నారు.

మార్క్స్‌కు ఏ పనీ సగం సగం చేసే అలవాటు లేదు. అందువల్ల ఈ పరిశోధన, అధ్యయనం ప్రారంభించగానే.... అందులో పూర్తిగా మునిగిపోయాడు. కొన్నిసార్లు మార్క్స్‌కు సెక్రటరీగా పనిచేసిన విల్హెం పైపర్ , ఒకసారి ఎంగెల్స్‌తో, 'ఈ మనిషిని చూడటానికి పోతే, హలో అనటానికి బదులు ఆర్థిక విషయాలు వివరిస్తూ స్వాగతం పలుకుతాడు' అంటూ జోక్ చేశాడు. అయితే ఎంగెల్స్‌కి ఇదేం ఆశ్చర్యకరమైన విషయం కాదు. ఈ సమయంలో ఎంగెల్స్‌కు రాసిన మార్క్స్ వుత్తరాలన్నీ ఆర్థిక సమాచార విశ్లేషణలోనే నిండి వున్నాయి. అలా ప్రారంభమైన వాళ్ల వుత్తర ప్రత్యుత్తరాలు, యించుమించు రోజుకొకటి చొప్పున, రెండు దశాబ్దాల పాటు కొనసాగాయి – అంటే 1870లో లండన్‌కు తిరిగి వచ్చిందాకా. 'అంకుల్ ఏంజెల్స్' నుంచి వచ్చే వుత్తరాల కోసం పిల్లలు కూడా చాలా వుత్సాహంగా నిరీక్షించారు. పోస్ట్‌మాన్ తెచ్చే కవర్లో తరచూ డబ్బు కూడా వుంటుంది. అంటే ఇల్లు గడపటానికి యిబ్బంది లేదు.మాంచెస్టర్‌కు వెళ్లిన తర్వాత ఎంగెల్స్ రెండు యిళ్లలో వున్నాడు. ఒకటి స్థితిమంతుడైన వ్యాపారస్తుడుండే ఇల్లు. ఇక్కడ వ్యాపార విషయాలు చర్చిస్తారు. వినోద కార్యక్రమాలు జరుగుతాయి. మరొకటి ఊరి చివర మిస్టర్ అండ్ మిసెస్ బోర్డ్‌మాన్ పేరుతో వున్న చిన్న యిల్లు. ఇక్కడ తను మేరీ బర్న్స్, ఆమె సోదరి లిజ్జీ తో కలిసి వుంటాడు. ఐరిష్ రాడికల్స్ యిక్కడికి వస్తుంటారు.

ఎంగెల్స్‌కు తన తండ్రి ఎంతకాలం మాంచెస్టర్‌లో వుండమంటాడో తెలియదు కాని అక్కడ వున్నన్నాళ్లూ మార్క్స్ కుటుంబాన్ని ఆర్థిక యిబ్బందుల్నుండి దూరంగా వుంచాడు. ఒకటో,

లీబ్ క్నెష్ట్

"ఈ కొత్త యిల్లు పైఅంతస్తులో వుంది. గదులు చాలా యిరుకు, నీళ్లు పైకి రావు. అందువల్ల కింది నుండి పైకి మోసుకు రావాల్సిందే. బాత్‌రూం, లేవటరీలకు నీటి సౌకర్యం లేదు. అందువల్ల అ యింట్లో వుంటున్న ఇతర వాటాదార్లూ, వీళ్లూ కలిసి ఒకే కామన్ టాయ్‌లెట్ వుపయోగించుకోవాలి. వ్యర్థమంతా కిందవున్న ఒక ఛేంబర్ పాట్ (మల విసర్జనకు వుపయోగించే పాత్ర) లోకి పోతుంది. పై అంతస్తులో వున్నారు కనక ఆ దుర్గంధాన్ని భరించనక్కర్లేదు. అలా వీళ్లు అదృష్టవంతులే. పైన వుండటంతో నేలకన్నా ఆకాశానికే దగ్గరగా వున్నట్టుగా వుహించుకున్నారు. ఎలా వుంటేనేం. తరువాత అయిదు సంవత్సరాలకూ అదే 'మోస్ట్ర ఇల్లు' అన్నాడు లీబ్‌క్నెష్ట్. 'వాళ్ల జీవితంలో ఒకే చోట ఎక్కువ కాలమున్నారంటే అది యిక్కడే "

"ఇక, మార్క్స్ రోజంతా బ్రిటిష్ మ్యూజియంలోనే గడుపుతాడు. 'లండన్‌లో మిగతా శరణార్థులు ప్రపంచ విప్లవం కోసం సన్నాహాలు చేసుకుంటున్నప్పుడు, మేం బ్రిటిష్ మ్యూజియంలో పుస్తకాలు చదివి భవిష్యత్ పోరాటాల కోసం ఆయుధాలు తయారుచేసుకున్నాం. కొన్నిసార్లు తిండి వుండేది కాదు. అయినా బ్రిటిష్ మ్యూజియంకు మాత్రం వెళ్లక తప్పదు. కనీసం సుఖంగా కూర్చోవటానికిక్కడ మంచి కుర్చీలన్నా వున్నాయి (ఇంట్లో వున్నట్టు చల్లగా వుండదు). వెచ్చగా హాయిగా వుంటుంది. అంటే యిల్లంటూ వున్న వాళ్ల గురించి నేను మాట్లాడుతున్నాను' అంటూ ఆ రోజుల్ని గుర్తుచేసుకున్నాడు లీబ్‌క్నెష్ట్."

రెండో పౌండ్లు కవర్లో పెట్టకుండా మార్క్స్‌కు ఎప్పుడూ వుత్తరం పోస్టు చెయ్యలేదు. నిజానికి మార్క్స్ కుటుంబం కాస్త చింతలు లేకుండా గడిపిందంటే అది ఈ కాలంలోనే. మార్క్స్ తన పొలిటికల్ ఎకానమీ అధ్యయనం కొనసాగిస్తూ కరపత్రాల రూపంలో కొన్ని రచనలు చేసి ఎంతో కొంత సంపాదించాలనుకొన్నాడు. పొలిటికల్ అండ్ ఎకనమిక్ రివ్యూను స్విట్జర్లాండు నుండి ప్రారంభించటానికి కూడా ప్రయత్నించాడు. గుయిడో మరణం తర్వాత పిల్లలు కూడా యిన్నాళ్లకు మళ్లీ వుషారుగా ఆడుకుంటున్నారు. అంటే అంతా సజావుగానే సాగుతున్నదని కాదు.

లిడియా లిజ్జీ

శరణార్థులలో తగువులు కొనసాగుతూనే వున్నాయి. విల్లిష్ మనుషులు మార్క్స్ మద్దతుదారుల మీద దాడిచేసి గాయపర్చారు. కాన్రాడ్ ష్రాం, షైపర్‌ల మీద కూడా చేయిచేసుకున్నారు. అయితే, మార్క్స్ ఇప్పుడు వీటిలో జోక్యం చేసుకోవటానికి బదులు, వాళ్లకు దూరంగా వున్నాడు. 'కోతిమూక' అన్నాడు. వ్యంగ్యంగా 'ఎవరికి చేతనైంది వాళ్లు చేస్తారు' అని వ్యాఖ్యానించాడు. తన శత్రువులను ఎద్దేవా చెయ్యటానికి మార్క్స్ వుపయోగించిన ఈ వాక్యం, కమ్యూనిస్టు సిద్ధాంతానికి మూలస్తంభంగా నిలిచిన 'each according to his abilities ' అయింది.

జనవరి చివరినాటికి గుయిడో మరణించాడనో లేక అద్దె కట్టలేదనోగాని యిల్లు ఖాళీ చెయ్యమన్నారు. ఈసారి కుటుంబం 28, డౌన్‌స్ట్రీట్ సోహోకు మారింది. పాత యింటికి దగ్గరే కాని ఈ యిల్లు దానికన్న కాస్త మెరుగ్గా వుంది. నిజానికి అక్కడ అద్దెకుంటున్న ఒక టీచర్, తన యింట్లో కొంత భాగాన్ని వీళ్లకు మళ్లీ అద్దెకిచ్చాడు.

కొత్త అపార్ట్‌మెంట్‌లో అందరికీ రొటీన్ జీవితం అలవాటైంది. ఆడపిల్లలు స్కూలుకెళ్లారు. భర్త వ్యవహారాలూ, పిల్లల సంగతీ చూసుకుంది జెన్నీ. ఇంటి పనుల బాధ్యత లెంచెన్‌దే. అంటే – ఎంగెల్స్ పంపిన, లేదా మార్క్స్ అప్పు చేసిన కొద్దిపాటి డబ్బుతో అందరి కడుపులు నింపాలి. ఈ డబ్బు సరిపోనప్పుడు, తమకు అక్కర్లేని దుస్తులో మరేవో తాకట్టు పెట్టుకొని మరో 'అంకుల్' తమను ఆదుకుంటున్నాడనుకున్నారు పిల్లలు.

మద్యశాలల్లోని ప్రైవేటు రూంలలో రాత్రిపూట రాజకీయ సమావేశాలు జరిగేవి. అందరూ స్ట్రాంగు బీర్లు (stout) తాగుతూ, మట్టి పైపుల్లో పొగ పీల్చుతూ చర్చల్లో, పాల్గొనేవారు. ఎవరి దగ్గరా డబ్బు లేనప్పుడు – చాలా రోజులు యిదే పరిస్థితి అనుకోండి– అందరూ కలిసి బుద్ధిగా డౌన్‌స్ట్రీట్ అపార్ట్‌మెంట్‌లో తలదాచుకున్నారు. ఎంతటి దారిద్ర్యంలోనూ మార్క్స్, జెన్నీ, వున్నదేదో అందరితో పంచుకున్నారు. మార్క్స్ వాళ్లందరికీ 'నాయకుడు' మరి! 'నాయకుడు' అనే మాటకు ఎంత నిరసన తెలిపినా అందరూ మార్క్స్‌ను అలాగే భావించారు!

సశేషం

ఫోన్: 91776 18708

అందం.. అభినయం (తరువాయి భాగం)

చిత్రం సత్యం శివం సుందరంలో నటించేందుకు డేట్స్ కుదరనంత పరిస్థితి. ఒళ్లుమండిన అన్నయ్య నీవు టాక్సీ కపూర్‌గా మారిపోయావు అన్నాడట. అంటూ వూరికే తిరుగుతున్నావు అని! ఇంగ్లీషులో షేక్స్పియర్ వాలా, హీట్ అండ్ డస్ట్ వంటి చిత్రాల్లో నటించిన శశి కపూర్ 1972లో కోనర్ క్రూక్ తీసిన సిద్ధార్థ ఆంగ్ల చిత్రంలో టైటిల్ రోల్ పోషించారు. లౌకిక తాత్విక చింతనల మధ్య నలిగి పోయిన వ్యక్తి కథ అది. ఆయనకు బాగా పేరు తెచ్చింది. పరిశోధనాత్మక జర్నలిజంలో రాజకీయ వేత్తలు ఎలా తప్పు దోవ పట్టిస్తారో చెప్పే న్యూఢిల్లీ టైమ్స్ ఆయనకు జాతీయ ఉత్తమ నటుడి అవార్డు తెచ్చిపెట్టింది.

కమర్షియల్ చిత్రాల్లో ఇంత బిజీగా వున్నా తనదైన అభిరుచి నిలబెట్టుకోవడం శశి కపూర్‌కే చెల్లింది. ఫిలిం వాలాస్ పేరిట స్వంత సంస్థను స్థాపించి ఆయన సమాంతర చిత్రాలు తీశారు. అపర్ణాసేన్ దర్శకత్వంలో జెన్నిఫర్ నాయికగా తీసిన 36 చౌరంగీ లేన్ ఒక క్లాసిక్‌గా పేరు పొందింది. తర్వాత శ్యాం బెనగల్‌తో జునూన్ సమయంలో ఏర్పడిన పరిచయం మహాభారతం ఆధునిక రూపంగా కలియుగ్ తీయడానికి కారణమైంది. కుమారుడు కునాల్ కపూర్‌తో కలిసి ఎయిర్‌ఫోర్స్ నేపథ్యంలో తీసిన విజేత మరో వెరైటీ. రేఖ నాయికగా వసంత సేన కథతో తీసిన ఉత్సవ్‌లో లావాటి విదూషక విలన్ శకారుడుగా శశి కపూర్ నటించడం మరో వింత. ఒకప్పటి అందాల నటుడు ఎలా మారిపోయాడో ఆ పాత్రతో తెలిసింది. ఆ చిత్రమూ తన్నింది! 80ల తర్వాత ఆయన చాలా తక్కువ చిత్రాలే అంగీకరిస్తూ వచ్చారు. భార్య జెన్నిఫర్ కాన్సర్‌తో 84లో మరణించింది. ఆమె అనారోగ్యం తర్వాత శశి ఒక విధమైన నిరాసక్తతో శరీరాకృతిని నిర్లక్ష్యం చేసి బాగా పెంచేశాడు. వారి అమ్మాయిలు అడపాదడపా నటించినా పాశ్చాత్య పోలికలతో వుండటం అననుకూలంగా పరిణమించింది.

గతంలోనే పద్మ భూషణ్ పురస్కారం పొందిన శశి కపూర్‌కు ఆ కుటుంబంలో పృథ్వీరాజ్ కపూర్, రాజ్‌కపూర్‌ల తర్వాత ఇప్పుడు దాదాసాహెబ్ కూడా లభించడంతో అరుదైన విశేషం. అభిమానులకు ఆనంద కారణం.

కోకోనట్ మిల్క్‌షేక్

కావలసిన పదార్థాలు

కొబ్బరిపాలు – 2 కప్పులు
పాలు – 2 కప్పులు
క్రీమ్ – 2 స్పూన్లు
పంచదార – రుచికి తగినంత
రోజ్ ఎస్సెన్స్ – 1 స్పూన్
నల్లద్రాక్ష పండ్లు – కొద్దిగా

తయారుచేసే విధానం

కొబ్బరికాయను పగలకొట్టి కొబ్బరిపాలు తీసుకోవాలి. పాలను మీగడ కట్టకుండా మరగబెట్టి ఎర్రగా, చిక్కగా బాసుంది క్రీములాగా తయారు చేయాలి. ఈ క్రీములో పంచదార, కొబ్బరిపాలు పోసి మజ్జిగ కవ్వంతో బాగా నురగ వచ్చేట్టుగా చిలకాలి. నురగ వచ్చిన తర్వాత రోజ్ ఎస్సెన్స్ వేసి కొద్ది సేపు ఫ్రిజ్‌లో వుంచాలి. సర్వ్ చేసేటప్పుడు పైన నల్లద్రాక్ష వేసుకుంటే బావుంటుంది.



కమలా హనీ

కావలసిన పదార్థాలు

కమలా పండ్లు– 2
నిమ్మపండు – 1
తినే సోడా – చిటికెడు
తేనె – 1 స్పూన్

తయారుచేసే విధానం

కమలా పండ్ల పైతోలు తీసి, ఒక బట్టలో వేసి రసం తీయాలి. కమలా రసంలో గింజలు రాకుండా రసం పిండాలి. ఒక స్టీలు గరిటె వేడి చేసి అందులో తేనె పోసి, ఆ తేనెని కమలా రసంలో కలపాలి. దానిలో చిటికెడు తినే సోడా కలిపి ఓ గంటసేపు ఫ్రిజ్‌లో పెట్టాలి. గ్లాసులో ఐస్ ముక్కలువేసి ఈ రసాన్ని పోసి సర్వ్ చేయాలి.

బనానా షేక్

కావలసిన పదార్థాలు

అరటిపండు – 1
పంచదార – 2 స్పూన్లు
పాలు – 2 గ్లాసులు
జాజికాయ – కొంచెం
రోజ్‌వాటర్ – అరస్పూన్
ఐస్‌ముక్కలు – కొద్దిగా

తయారుచేసే విధానం

అరటిపండు తోలు తీసి ముక్కలు చేసి పాలలో వేయాలి. అందులోనే పంచదార కూడా వేసి మిక్సీలో వేయాలి. బాగా నురగ వచ్చేవరకు బీట్ చేయాలి. తర్వాత దానిపై రోజ్‌వాటర్ చల్లి కొంచెం సేపు ఫ్రిజ్‌లో వుంచాలి. సర్వ్ చేసేముందు గ్లాసులో ఐస్‌ముక్కలు వేసుకుంటే బాగుంటుంది.

రైస్ డ్రింక్

కావలసిన పదార్థాలు

అన్నం గంజి – 1 గ్లాసు
ఉప్పు – చిటికెడు
నిమ్మరసం – 1 స్పూన్

తయారుచేసే విధానం

మామూలుగా మనం వండే అన్నంలోనే కొద్దిగా ఎక్కువ నీరు పోసి పొంగు వచ్చిన కొద్ది సేపటి తర్వాత ఎక్కువగా వున్న గంజిని ఒక గిన్నెలోకి వంచాలి. ఆ గంజిని చల్లారే వరకు అలాగే వుంచి చిటికెడు ఉప్పు, నిమ్మరసం వేసి ఒక గంట ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇది రుచిగా వుండటమే కాకుండా ఆరోగ్యానికి కూడా మంచిది.

చుక్కలు కలపండి

బూటుకు దారేది?

ఈ అమ్మాయి పేరు సిండ్రిల్లా. కంగారుగా వెళ్తుంటే కాలి బూటు ఊడిపోయింది.ఇంతకీ ఆ బూటు అందుకోవాలంటే ఏ దారిలో వెళ్లాలో చెప్పకోండి.



పదహారు బొమ్మలు ఎక్కడున్నాయి!

పిల్లలంతా అడవి చూడ్డానికి వెళ్లారు. ఆ బొమ్మను ఆర్టిస్టు అంకుల్ బాగా వేశారు కదా. అయితే ఆ బొమ్మలోనే పదహారు బొమ్మలను దాచిపెట్టాడాయన. ఇంతకీ అవన్నీ ఎక్కడున్నాయో గుర్తించి సున్నా చుట్టండే. అన్నట్టు మీరు కనిపెట్టాల్సిన బొమ్మలు పేర్లతో సహా ఇక్కడే వున్నాయి.

బేర్ బొమ్మ వేద్దాం



ఏవి ఎన్ని?



ఇక్కడ పురుగులు, సూర్యుళ్లు, పిరమిడ్లు, నదులు వున్నాయి. అన్నీ బొమ్మలేలెండి. ఇంతకీ ఏవి ఎన్ని వున్నాయో లెక్కించి అదిగో ఆ బొమ్మల పక్కనే వేసేయండే.

ఆ ఒక్కటి ఏది?

ఇక్కడ అనేక రకాల జంతువులు, పక్షులు వున్నాయి. కాకపోతే అన్నీ జంటగానే వున్నాయి. ఒక్కటి మాత్రం సింగిల్‌గా వుంది. ఆ ఒక్కటి ఏదో కనిపెట్టండి చూద్దాం.

బిడ్డ కనిపించిందా?

ఇక్కడో చక్కని ప్రకృతి దృశ్యం వుంది కదా. ఆ జంట కూడా అదే పనిగా చూస్తోందా కనువిందైన అందాన్ని. ఇంతకీ వాళ్ల బిడ్డ కూడా ఈ బొమ్మలోనే వుంది. మీకేమైనా కనిపించిందా?



జవాబు :
నీళ్లల్లో వుంది.

జంటగా లేనివి ఏవి?

అబ్బో...ఏంటి ఇన్ని జంతువులు, పక్షులు వున్నాయిక్కడ? చూడ్డానికి అన్నీ రెండేసి వున్నట్టున్నాయే. కానీ కొన్నిటికి మాత్రం జంటలు లేవు. ఇంతకీ అవి ఏవో?

తొమ్మిది జంతువులు

మీరు చురుకైన పిల్లలంట కదా. ఇక్కడ తొమ్మిది జంతువుల పేర్లున్నాయి. వాటిని పైనున్న అక్షరాల బాక్సులో కనిపెట్టాలి. అడ్డంగా, నిలువుగా, క్రాస్‌గా ఎలాగైనా వుండొచ్చు. మరి రెడీనా!

F	C	A	T	H
D	O	G	E	O
U	W	X	G	R
C	P	I	G	S
K	O	W	L	E



కొత్త పుస్తకాలు

గొప్ప ప్రేరణ

మేరీక్యూరీ పోలండ్ దేశానికి చెందిన అత్యంత గొప్ప మహిళా శాస్త్రవేత్త. ఆమె తన జీవితంలో ముఖ్యంగా విజ్ఞాన శాస్త్రరంగంలో ప్రపంచంలోనే ఎన్నో మొదటి స్థానాలు పొందింది. ఆమె తన ఆవిష్కరణలకు గానూ నోబెల్ పురస్కారం పొందిన ప్రప్రథమ మహిళా శాస్త్రవేత్త కూడా. భౌతిక శాస్త్రంలో తన భర్తతోపాటు నిరంతర పరిశోధనలు గావించి, అందుకు భర్తతోపాటు నోబెల్ పురస్కారం పొందిన మహాజ్ఞాని ఆమె! నోబెల్ పురస్కార చరిత్రలోనే విభిన్న శాస్త్ర అంశాలకు గాను రెండుసార్లు నోబెల్ బహుమతి పొందిన మహిళాశాస్త్రవేత్త మేరీక్యూరీయే. మొదటి నోబెల్ పురస్కారం భౌతిక శాస్త్రంలో అయితే రెండవ నోబెల్ పురస్కారం రసాయన శాస్త్రంలో పొందిన తొట్టతొలి శాస్త్రవేత్త కూడా ఆమే! విద్యార్జనా కాలంలో కూడా మేరీ ఎల్లప్పుడూ ప్రథమ స్థానంలోనే ఉండేది.

జ్ఞానసంపన్నులు కఠోర శ్రమ ద్వారా.. తమ లక్ష్యాలను సాధించుకోగలరని మేరీక్యూరీ జీవితం మనకు తెలియజేస్తుంది.సామాజిక కారణాలవల్ల కలిగే పేదరికం, మహిళలపట్ల వివక్ష లాంటి అవరోధాలన్నిటినీ అధిగమించి.. తన లక్ష్యాలను సాధించింది మేరీ!

ఆమె ఒక బాలమేధావి కూడా. ఆమెలో చిన్నప్పటినుంచే దేశభక్తి నిండి ఉంది. ఆమె దేశమైన పోలండ్ రాజధాని వార్సాను, దాని చుట్టుప్రక్కల ప్రాంతాలను రష్యన్ నియంతమైన రెండవ అలెగ్జాండర్ జార్ చక్రవర్తి ఆక్రమించుకున్నాడు. అయితే అతన్ని రష్యాలోనే అంతర్గత కలహాల్లో చంపేశారు. ఇది విన్న మేరీక్యూరీ తన తరగతి గదిలోనే తన స్నేహితురాలు కాసియాతో నాట్యమాడి ఆనందం వ్యక్తపరిచింది. విదేశీ పాలన వల్ల మేరీక్యూరీ కుటుంబం కూడా ఎన్నో బాధలనుభవించింది. అయితే, చివరిదాకా ఆమె మనసులో మాత్రం దేశభక్తి వెల్లివిరుస్తూనేవుండేది. ఆమె పూర్తికాలం శాస్త్రవేత్తగా మారిపోయినా.. 'స్వతంత్ర పోలండ్ ఉద్యమ బృందం'లో సభ్యురాలుగా కూడా ఉండేది. మాతృదేశ విముక్తికి తన శక్తిమేర కృషిచేస్తూనే ఉండేది. ఆమె ఎల్లప్పుడూ తన దేశీయులపట్ల అత్యంత ఆదరాభిమానాలతో మెలిగేది. ఆకాలంలో పోలండ్‌లో సమాజ పెద్దలుగా చెలామణి అయ్యేవారు బాలికావిద్యను వ్యతిరేకించేవారు. వారిని ఎదిరించి నిలబడింది మన మేరీ!

తర్వాతికాలంలో ఆమె ఫ్రాన్స్ రాజధాని ప్యారిస్‌లో ఉన్నప్పుడు కూడా ఇదే వైఖరి కొనసాగించింది. అక్కడి సైన్సు ప్రయోగశాలలు అన్నీ పురుషుల ఆధీనంలో ఉండేవి. వారు తమ ప్రయోగశాలల్లో పనిచేసే మహిళలపట్ల అసభ్యంగా ప్రవర్తించేవారు. అందువల్ల విరక్తిచెందిన మేరీ తన పరిశోధనాశాలలో పూర్తిగా మహిళలనే నియమించుకుంది. అంతేగాక, ఆ మహిళలను సైన్సురంగంలో నిరంతర కృషి చేసేందుకు ప్రోత్సహించేది. దీంతో ఎందరో మహిళలు తమ వైజ్ఞానిక ప్రతిభలను పెంపొందించుకున్నారు. ఉదాహరణకు ఆమె పరిశోధనాశాలలో 'మార్గరెట్ బెరీ' అనే మహిళ పరీక్షనాళికలను శుభ్రంచేస్తూ ఉండేది. ఆమెలోని వైజ్ఞానిక ఆసక్తిని గమనించిన మేరీ సైన్సు పరిశోధనలు చేయమని ఆమెను బాగా ప్రోత్సహించింది. తదనంతర కాలంలో ఆ మార్గరేట్ బెరీ తన పరిశోధనాజ్ఞానాన్ని పెంపొందించుకోవడమేగాక, అణుధార్మికత గల ఒక లోహమూలకాన్ని కూడా కనుగొంది. ఆ మూలకానికి ఆ మహిళ తన మాతృదేశం పేరునే 'ఫ్రాన్సియం' అని నామకరణం చేసింది. మేరీ క్యూరీ ఈ పద్ధతిలోనే తన పెద్దకుమార్తె రెనీ క్యూరీకి కూడా భౌతికశాస్త్ర పరిశోధనలో ఎంతో ప్రోత్సాహమిచ్చింది.

మేరీ క్యూరీ ఎన్నో భావనలు, ఆవిష్కరణలు ఇంగ్లాండుకు చెందిన ప్రసిద్ధ విజ్ఞానవేత్త, ఛార్లెస్ డార్విన్ భావనలు, ఆవిష్కరణలకూ దగ్గరగా వున్నాయి. డార్విన్ మేరీకన్నా ఎంతో పెద్దవాడు. ఆయన 1806–1882లో జీవించాడు.

ఆయన జీవరాసుల ఆవిర్భావం, పరిణామ సిద్ధాంతాన్ని కనుగొని ప్రపంచానికి నూతన మార్గం చూపించాడు. డార్విన్ తన పదేళ్ళ కుమార్తె ఆనీ ఎలిజిబెత్ ఆకస్మిక మరణాన్ని తట్టుకోలేకపోయాడు. ఆ ఆవేదనలో విరక్తి చెంది క్రైస్తవ దేవాలయానికి ఆదివారం ప్రార్థనకు కూడా వెళ్లకుండా మానుకున్నాడు. అలాగే మేరీక్యూరీ స్కూల్ విద్యార్థినిగా ఉన్నప్పుడే.. తన అక్కయ్య సోఫియాను, తల్లి బ్రోనిస్లావాను కూడా కోల్పోయింది. ఈ వేదన మేరీని చాలాకాలం



విజ్ఞాన ప్రజ్వలిత
మేరీక్యూరీ, రచన: ఆర్.పెరియస్వామి,
తెలుగు: ఎ.జి.యతిరాజులు, ధర: రు.40/-,
పేజీలు: 71, ప్రతులకు: ప్రజాశక్తి బుక్‌హౌస్,
27-1;54, ఏలూరు రోడ్, గవర్నర్ పేట,
విజయవాడ-2, ఫోన్: 0866-577533.

కలచివేస్తూనే ఉండేది. దీని ప్రభావంతో ఆమె కూడా తన క్రైస్తవ మతం పట్ల విశ్వాసం పోగొట్టుకున్నది. చర్చికి వెళ్లడం కూడా మానుకున్నది.

ఆ కాలంలో డార్విన్, మేరీ – ఇద్దరూ కూడా Agnosticism అనే తాత్వికతను వంటబట్టించుకున్నవారే! ఈ తాత్వికత మూలం మనం కంటికి కన్పించేవి, భౌతికంగా అనుభవించే వాటిని తప్ప ఇంకేమీ నమ్మలేమంటుంది.

పేదరికం ఒక ప్రక్క బాధిస్తున్నా.. ఎలాగైనా సరే ఉన్నత విద్య అభ్యసించాలనే తీవ్రమైన ఆకాంక్షతో మేరీ ఫ్రాన్స్‌లో ట్యూషన్ల వంటి చిన్నాచితకా పనులు చేస్తూ విద్యార్జన చేసింది. ఆ విద్యాప్రతిభతోనే ఈనాడు విజ్ఞానశాస్త్రరంగంలో మార్గదర్శిగా వెలుగొందుతుంది మేరీ క్యూరీ.

కానీ ఆమె ఏనాడూ తాను ఒక ప్రత్యేక ప్రతిభావంతురాలనని గొప్పలుపోయేది కాదు. అందువల్లే ఆమె సమకాలికుడు, సుప్రసిద్ధ శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ మేరీ గురించి ఇలా చెప్పాడు : 'శాస్త్రవేత్తలు అనేకంగా తమకు లభించిన పేరు ప్రఖ్యాతులకు భ్రమించి, లొంగిపోతారు. అయితే మేరీక్యూరీ ఒక్కరే ఎప్పుడూ తన కీర్తి ప్రతిష్ఠలకు బలికాని శాస్త్రవేత్త'. ఈ మహత్తరమైన మహిళామణి జీవితచరిత్ర, విజయపథం అందుకోవాలని ఆశించే యువతకు, ముఖ్యంగా విద్యార్థినీ విద్యార్థులకు గొప్ప ప్రేరణ.

-స్నేహ

మాట్లాడే నట్లు

మనుషులకు మాత్రమే మనసుంటుందా? వారు మాత్రమే స్పందిస్తారా? భావోద్వేగాలు వారికి మాత్రమే వుంటాయా? అయినవారికోసం వారు మాత్రమే తపిస్తారా? అంటే కాదనేస్తారు వీటిని చూశాక. మన దృష్టిలో నట్లు, బోల్టులు ఇనుప ముక్కలే ఇప్పటి వరకు. మనసు, స్పందన, మూగ వేదన, మౌనగీతం వంటివాటిని ఇవి కూడా పలికించగలవంటున్నాడు టోబె మామ్. ఇతను స్వీడన్‌లో కమ్మరి పని చేస్తుంటాడు. ఇతనికి ఎందుకో ఈ ఇనుప ముక్కలు కూడా ఏదో చెప్తున్నట్టు అనిపించేదట. ఇంకేం అతనికి అనిపించిన భావాలను ఇదిగో ఇలా మన ముందుంచాడు. ఈ నట్లు బోల్టులు ఎక్కడివనుకుంటారేమో! బెర్గ్స్‌లాడెన్‌లోని పాత షెడ్డు నుంచి సేకరించాడు. అతను చేసేందేమీ లేదు. వాటిని తనకు తోచిన పద్ధతుల్లో వంచడం, వెల్డింగ్ చేయడం. అంతే. అంత మాత్రానికే అవి విచారాన్ని, సంతోషాన్ని, బాధను, హాస్యాన్ని, ప్రేమను...మౌనంగా పలికించసాగాయి. వీటికి 'బోల్ట్ పొయట్రీ' అన్న పేరు కూడా పెట్టేశాడు టోబె. నట్టులు, బోల్టులే కాదు! ప్రపంచంలోని చాలా వస్తువులు మన ముందే వుంటాయి. వాటిని చూసే హృదయాన్ని బట్టి కళాత్మకంగా కనిపిస్తాయంతే.

●

కేకో కేక

ఒకసారి చూస్తే ఇవన్నీ పలు రకాల తినుబండారాల్లా కనిపిస్తాయి. నిజం చెప్పాలంటే... ఒకసారి కాదు. పది సార్లు చూసినా అంతే. నిజానికి ఇవన్నీ కేకులంటే నమ్ముతారా! కళ్లు పెద్దవి చేసి నోరు తెరిచేసి అలా వుండిపోతారంతే. వీటిని తయారుచేసింది డెబ్బీ. శాన్‌ఫ్రాన్సిస్కోకి చెందిన ఓ బేకరీలో ఈమె పని చేస్తుంది. నిజానికి ఈమె ఎక్కడా కేకుల తయారీ గురించి ప్రత్యేకమైన శిక్షణ పొందలేదు. బేకరీలో కేకులను అందంగా తీర్చిదిద్దే పనిచేసే సీనియర్ ఉద్యోగి ఒకరు రిటైరయ్యాడు.అంతే...ఆమెకి ఇదో అద్భుతమైన అవకాశాన్నిచ్చింది. ప్రయోగాలు చేస్తూ సొంతగా నేర్చేసుకుందంతే. బొమ్మల్లో కనిపించే రకరకాల వస్తువులు కూడా కేకులే. కుక్కర్, టోపీ, స్ట్రాలు, కత్తులు, ఫోర్కులు, గిన్నెలు, బాటిళ్లు, ట్రేలు, ప్లాస్టిక్ కవర్లు, తగరపు కాగితాలు, పేపర్ నేప్కిన్లు.....సైతం కేకులేనంటే నమ్మబుద్ధి కాదు. డెబ్బీలో మరో ప్రత్యేకత కూడా వుంది. ఆమె తండి పదార్థాలనే కాదు! యంత్రాలు, జంతువులు, వస్తువులు, బూట్లు, దైనందిన జీవితంలో వాడుకునే వస్తువులు, హారర్ థీమ్ కేకులను కూడా తయారుచేయగలదు. కేక కదా! ●